జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన రాష్ట్రాన్ని కల్తీ రాజ్యంగా మార్చింది. కోవిడ్ మందులు, మద్యం, ఇసుక, విద్య వ్యవస్థ అన్నింటిలోనూ కల్తీ చేశారు. చివరకు తిరుమల లడ్డూ నెయ్యి కల్తీతో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ


శుక్రవారం 20.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 304 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

### అందుకు అనుగుణంగా అధికారులు రూట్ మ్యాప్ రెడీ చేయాలి

### జాబ్ క్యాలెండర్ తోపాటే వర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి కసరత్తు

### కోచింగ్ సెంటర్ల నిర్వహణ గురించి సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాల అమలుపై మంత్రి లోకేష్ సమీక్ష





**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్న తరుణంలో ఉపాధి కల్పనపైనే యంత్రాంగం దృష్టిపెట్టాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఏపీఎస్ఎస్ డీసీ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రౌండ్ అయిన పరిశ్రమల్లో ఈ ఏడాది 2లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం, అందుకు అనుగుణంగా అధికారులు రూట్ మ్యాప్ రూపొందించాలని సూచించారు. ఇప్పటికే గ్రౌండ్ అయిన పరిశ్రమల్లో పెద్దఎత్తున యువతకు ఉద్యోగాలు కల్పించడంపై దృష్టిసారించండి. రిలయన్స్ సీబీజీ, జుపిటర్, లారెన్స్ ఫార్మా, హెట్రో డ్రగ్స్ తోపాటు రాష్ట్రంలో కొత్తగా వస్తున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ చేపట్టండి. ఇందుకు అవసరమైన కరిక్యులమ్ రూపకల్పనలో ఆయారంగాల్లో పేరుగాంచిన పరిశ్రమల సలహాలను తీసుకోండి. ఇప్పటికే కొన్ని ప్రధాన సంస్థలు నేరుగా స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణా కేంద్రాలను నెలకొల్పాయి, వాటిని అధ్యయనం చేసి, అదేతరహాలో ఐటీఐలకు అనుబంధంగా ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసేలా చూడాలని సూచించారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మూడునెలలకోసారి నిర్వహిస్తున్న జాబ్ మేళాల ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నాయి, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని అన్నారు.

**త్వరలో ఏఐ ఆధారిత నైపుణ్యం పోర్టల్ ప్రారంభం :** నైపుణ్యం పోర్టల్ పై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ... సాధ్యమైనంత త్వరలో పోర్టల్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ... ఇందుకు సంబంధించి ఇప్పటికే మాడ్యూల్స్ సిద్ధమయ్యాయి, 25 రంగాలకు సంబంధించి డేటా ఇంటిగ్రేషన్ పూర్తయింది, వాటిలో 1,14,899 ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 3,100 విదేశీ ఉద్యోగాలు కూడా ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 16మంది రిక్రూటర్స్ కూడా రెడీగా ఉన్నారు. ఇందులో ట్రయల్ బేసిస్ లో ఇప్పటికే 20వేలమందికి పైగా విద్యార్థులు,

మిగతా 2లో...

## 7 సంస్థలకు భూ కేటాయింపులు



- మంత్రివర్గ ఉపసంఘం కీలక నిర్ణయం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసింది. ఈ భేటీలో కొత్తగా 7 సంస్థలకు భూ కేటాయింపులు చేశారు. 11 సంస్థలకు గతంలో చేసిన కేటాయింపుల్లో మార్పులు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతిలో బ్యాంకు ఉద్యోగుల నివాసాలకూ భూమి కేటాయించామని చెప్పారు. రెయిన్ బ్రో చిల్డ్రన్ హాస్పిటల్‌కు రెండు ఎకరాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాజధాని భూ సమస్యల పరిశీలన, పలు సంస్థలకు భూములు, ప్రపంచ స్థాయి సంస్థలను అమరావతికి తీసుకురావడం వంటి అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు.

## స్వర్ణాంధ్ర విజన్ 2047

## లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ

- ఉపాధి హామీలో పెండింగ్ పనులు పూర్తి చేయండి
- వీబీజీ రామ్ జీ పథకంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వీబీజీ రామ్ జీ పథకం కింద పనులు చేపట్టేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు శ్రద్ధ పెట్టాలని సూచించారు.

మిగతా 2లో...



# భారత్‌కు యువతే బలం, బలగం

## ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్లో ప్రధాని మోడీ

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశానికి యువతే బలం, బలగమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇవాళ ఢిల్లీలోని భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026ను ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్, వివిధ దేశాల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, 500లకు పైగా టెక్ దిగ్గజ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సమ్మిట్ అని తెలిపారు. ప్రపంచంలో ఆరో వంతుకు భారత్ ప్రాతినిధ్యం వహిస్తోందని కామెంట్ చేశారు. ఏఐకి కేంద్రంగా ఇండియా రూపాంతరం చెందుతోందని అన్నారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీకి భారత్ కేంద్రంగా ఉందన్నారు. మానవుల సామర్థ్యాన్ని ఏఐ మరింత పెంచుతోందని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేస్తోందనేది కాదని.. ఇప్పుడు ఏఐతో మనం ఏం చేస్తున్నామనేది ముఖ్యమని పేర్కొన్నారు.

**దక్షిణాసియాకే గర్వకారణం.. :** ఏఐ సమ్మిట్ నిర్వహణ భారత్‌కే కాదు, దక్షిణాసియాకే గర్వకారణమని ప్రధాన మోడీ అన్నారు. ఏఐపై తొలినాళ్లలో అనేక సందేహాలు వచ్చాయని.. యువత ఇప్పుడు ఏఐని ప్రయోజనకరంగా ఉపయోగిస్తోందని అన్నారు. ఏఐ సదస్సు మేడిన్ ఇండియా, భారత్ సృజనకు వేదికగా నిలిచిందని కొనియాడారు. ఈ సదస్సు భారతీయ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని తెలిపారు.

మిగతా 2లో...

## ఉప్పాడ మత్స్యకారుల అభ్యున్నతికి సమగ్ర ప్రణాళిక

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సర్వతోముఖ అభివృద్ధి లక్ష్యంగా సమగ్ర ప్రణాళికను రూపొందించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రణాళికకు రూపకల్పన చేసినట్లు వెల్లడించారు.

గత ఏడాది అక్టోబర్ 9న కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై

మిగతా 2లో...

## ఢిల్లీ పర్యటనకు సీఎం చంద్రబాబు



- నేడు ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో పాల్గొనున్న సీఎం
- పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ కానున్న ముఖ్యమంత్రి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 కు ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు హాజరు కానున్నారు. ఏపీని సాంకేతిక హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో పాల్గొనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రముఖ పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్నారు. ఉదయం జైపూర్ నుంచి ఢిల్లీకి చేరుకోనున్న సీఎం భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ సమ్మిట్ వేదికకు వెళ్లనున్నారు. 9.30 గంటలకు ఏఐ యాక్సిలరేటర్స్, ఫ్యూయలింగ్ ఇండియాస్ ఎకనామిక్ గ్రోత్ అనే అంశంపై జరిగే ప్లీనరీ సెషన్‌లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొనున్నారు. అనంతరం రాష్ట్రంలో ఏఐ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కల్పనకు సంబంధించిన కొన్ని ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకోనుంది. ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఏపీలోని 10లక్షల మంది యువతకు నైపుణ్యాలు కల్పించేలా ప్రతిష్టాత్మక ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. క్వాంటంతో పాటు ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం ఏర్పాటు కోసం యూనిసీసీ సంస్థతోనూ ఒప్పందం జరుగనుంది. ఏపీలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ తోనూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది.

మిగతా 2లో...

### ఆసియాన్ దేశాలతో రక్షణ సంబంధాలే

## భారత్ ప్రాధాన్యత



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** భారత్ ఇండో-పసిఫిక్ వ్యూహంలో 'ఆసియాన్' దేశాలు కీలక స్తంభాలని, ప్రాంతీయ శ్రేయస్సుకు ఉమ్మడి భద్రతయే పునాది అని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు.

మిగతా 2లో...

## పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత



- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఇంజనీరింగ్ రంగ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పారిశ్రామిక వర్గాలకు ఎదురవుతున్న సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేసారు.

మిగతా 2లో...

### క్రిస్టియన్ భవన్ ను పూర్తి చేసే

## బాధ్యత తీసుకుంటాం

- క్రైస్తవ ఆస్తులు ప్రభుత్వ పరిధిలోకి రావు
- అక్రమాలు ప్రభుత్వ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం
- క్రిస్టియన్ భవన్‌కు రూపాయి కూడా జగన్ ఖర్చు చేయలేదు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

2 లో



## రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షలకు పైగా ఉచిత వ్యవసాయ కనెక్షన్లు



- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా 22,30,703 ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అసెంబ్లీలో ప్రకటించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ తో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు డిస్కంల పరిధిలో 1,02,538 కొత్త ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అయితే మరో 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపిన మంత్రి గొట్టిపాటి.. వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో మూడు డిస్కంల పరిధిలో రూ. 839.44 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో ఇప్పటివరకు 2,61,481 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.

మిగతా 2లో...

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు !

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- ఏక సభ్య కమిషన్‌గా రాజీవ్ రంజన్ మిశ్రా నియామకం
- కమిషన్ నియామకంపై సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు
- మిశ్రా కమిషన్ తో బీసీలకు మేలు : మంత్రి సవిత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. దీనిలో భాగంగానే మాజీ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికే పరిమితం చేసిందన్నారు. దీనివల్ల బీసీలు ఎన్నో పదవులు కోల్పోయారన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.

మిగతా 2లో...

# యువతకు పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

60వేలమంది జాబ్ సీకర్స్ కు విజయవంతంగా కీలకమైన ఏఐ ఆధారిత ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**అధ్యాపక పోస్టుల భర్తీ పై సమీక్ష :** రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి లోకేష్ అధికారులతో సమీక్షించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా గత ఏడాది నిర్వహించిన డీఎస్సీ తరహాలో ఉగాదికి విడుదల చేయబోయే జాబ్ క్యాలండర్ లో అధ్యాపక పోస్టుల నోటిఫికేషన్ కూడా ఇచ్చి, భర్తీకి చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన విదేశీ యూనివర్సిటీలకు (ఫారిన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ (ఖీుజు×ం) కు ప్రోత్సాహకాలు, విధివిధానాలపై చర్చించారు. విద్యార్థుల ఆత్మహత్య, మానసిక ఒత్తిడి నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కోచింగ్ సెంటర్ రెగ్యులేషన్స్ రూపకల్పనపై పబ్లిక్ డొమైన్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ సీఈవో గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పర్యటనకు సీఎం చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ ఏర్పాటు కోసం ఐఐటీ మద్రాస్ కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రకటన చేయనున్నారు. అనంతరం క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాంధీతోనూ ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించే రౌండ్ టేబుల్ కార్యక్రమంలో పాల్గొనున్నారు. కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అనే అంశంపై నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సదస్సులో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండే తో కలిసి ముఖ్యమంత్రి చర్చించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఏఐ సమ్మిట్ వేదిక వద్దే యునైటెడ్ కింగ్ డమ్ కు చెందిన ప్రతినిధి బృందంతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ కానున్నారు. బ్రిటన్ ఏఐ, ఆన్ లైన్ సేఫ్టీ విభాగం మంత్రి కనిష్క నారాయణ్, భారత్ లో యూకే హై కమిషనర్ లిండి కెమరాన్, వాతావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్ కౌన్సెలర్ శాలీ టేలర్ తదితరులతో ముఖ్యమంత్రి సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అరామ్కో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ అయితుకైర్, అడోబ్ సీఈఓ శాంతనూ నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హోలే తో ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశం కానున్నారు. అనంతరం ఢిల్లీ నుంచి బయల్దేరి రానున్నారు.

**ఇవాళ జైపూర్ కు వెళ్లనున్న సీఎం :** కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహానికి హాజరయ్యేందుకు ఇవాళ సాయంత్రం సీఎం జైపూర్ కు బయల్దేరి వెళ్లనున్నారు. సాయంత్రం 5 గంటలకు విజయవాడ నుంచి జైపూర్ కు బయలుదేరనున్నారు. జైపూర్ లోని వృందావన్ ప్యాలెస్ లో జరిగే వివాహానికి హాజరై రాత్రికి అక్కడే బస చేయనున్నారు. రేపు ఉదయం జైపూర్ నుంచి బయల్దేరి ఢిల్లీలో జరిగే ఇండియా ఇంపాక్ట్ ఏఐ సదస్సుకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు.

# భారత్‌కు యువతే బలం, బలగం





(మొదటి పేజీ తరువాయి)

కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ఈ వేదిక దోహదం చేస్తుందని అన్నారు. ఏఐలో విజన్‌తో పాటు సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నారు. మనం అణుశక్తి విధ్వంసాన్ని చూశామని, వికాసాన్ని చూశామని, ఏఐ కూడా అంతేనని అన్నారు. ఏఐ కత్తి రెండు వైపులా పదునున్న అస్త్రమని కామెంట్ చేశారు. భారత్‌కు యువత కొత్త శక్తిగా, ఆస్తిగా మారారని కితాబిచ్చారు. ఏఐ టెక్నాలజీ వినియోగం, వాటి ఫలితాలపై తుది నిర్ణయం మనిషిదే అయి ఉండా ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.

**మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలి.. :** ఏఐ మెషీన్ సెంట్రిక్‌గా కాదని.. హ్యూమన్ సెంట్రిక్‌గా ఉండాలని ప్రధాని మోడీ అన్నారు. అన్ని రంగాల్లో సమస్యలకు ఏఐ పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. పారదర్శకత్వమే అన్నింటి కంటే ఉత్తమమైన రక్షణ కవచమని ప్రధాని చెప్పుకొచ్చారు. మేడిన్ ఇండియా, భారత్ ఆవివష్కరణల సామర్థ్యం ఏఐ సదస్సు చాటుతోందని అన్నారు. ఏఐ సామర్థ్యం ఆలోచనలకు అందనంత దూరంగా ఉందని తెలిపారు. మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలని.. భారత్ ఏఐ పురోభివృద్ధికి ఓ చరిత్రగా నిలుస్తోందని ప్రధాన నరేంద్ర మోడీ అన్నారు.

# క్రిస్టియన్ భవన్ ను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో క్రైస్తవ ఆస్తులు ప్రభుత్వ పరిధిలోకి రావని, అయితే ఆక్రమణలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ప్రభుత్వ దృష్టికి తెస్తే, అమలులో ఉన్న చట్టాలమేరకు జిల్లా కలెక్టరు, ఇతర సంబంధిత అధికారులతో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఫరూక్ సమాధానం ఇచ్చారు. క్రైస్తవ సంస్థల నుండి వ్యతిరేకత వచ్చిన తర్వాత క్రైస్తవ ఆస్తులపై ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. జెరూసలేం యాత్రకు సంబంధించిన ప్రశ్నకు మంత్రి ఫరూక్ సమాధానం ఇస్తూ ఇజ్రాయిల్ లో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ఇక్కడి నుండి అక్కడికి యాత్రికులను పంపే పరిస్థితి ప్రస్తుతం లేదన్నారు. క్రిస్టియన్ భవన్ నిర్మాణం కోసం గత టిడిపి ప్రభుత్వ హయాంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి, రూ. 20 కోట్లు నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. 2019 లో అధికారంలోకి వచ్చిన జగన్ ఆన్ గోయింగ్ ప్రాజెక్ట్ క్రిస్టియన్ భవన నిర్మాణం కోసం ఒక్క రూపాయి కూడా ఐదేళ్లలో ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. తానేమో క్రిస్టియన్ అని జగన్ చెప్పుకుంటాడని.. నాకైతే తెలియదు గానీ జగన్ క్రిస్టియన్ కాదేమో ననుకుంటున్నానని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరులో క్రిస్టియన్ భవన్, కడపలో హజ్ హౌస్ ల నిర్మాణం చేపడితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ వాటిని పూర్తి చేసే బాధ్యత విస్మరించాడని మంత్రి ఫరూక్ ధ్వజమెత్తారు. 2014-2019 లో చర్చిలకు రూ. 90 కోట్లు ఇవ్వడం జరిగిందని, అయితే 2019 - 2024 లో కేవలం రూ. 4.12 కోట్లు జగన్ ఇచ్చారన్నారు. దీన్ని బట్టి క్రైస్తవుల పట్ల ఎవరికి అభిమానం ఉందో స్పష్టం అవుతుందని మంత్రి అన్నారు. మన ప్రభుత్వం- మన బాధ్యతగా భావించి క్రిస్టియన్ భవన్ నిర్మాణం పూర్తికి కట్టుబడి ఉందని, పూర్తి చేస్తామని మంత్రి ఫరూక్ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు !



(మొదటి పేజీ తరువాయి)

దీనిలో భాగంగా దీనిలో భాగంగానే మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించిందన్నారు. ఈ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నామన్నారు. నా బీసీలు అంటూ వెనుకబడిన కులాలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కోత విధించి, సమాజంలో సగభాగమైన వెనుకబడి వర్గాల వారిని రాజ్యాధికారానికి దూరం చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆది నుంచి బీసీల పక్షపాతి అని తెలిపారు. బీసీలకు జరిగిన ద్రోహాన్ని గుర్తించి, అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు అందజేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ ను నియమించారన్నారు.

**రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ తో బీసీలకు మేలు :** ఏపీలో ఎస్సీ వర్గీకరణంపై నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా విజయవంతమైన పాత్ర పోషించిందని మంత్రి సవిత తెలిపారు. రాజీవ్ రంజాన్ మిశ్రా సమర్థత గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు... ఆయన నేతృత్వంలో డెడికేటెట్ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిషన్ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు మేలు చేసేలా నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. డెడికేటెట్ కమిషన్ నియామకంపై బీసీ సంఘాలు సైతం హర్షం వ్యక్తంచేశాయి. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రులు లోకేశ్, సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు..

# ఆసియాన్ దేశాలతో రక్షణ సంబంధాలే భారత్ ప్రాధాన్యత



(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం వేదికగా జరుగుతున్న బహుళజాతి నౌకాదళ విన్యాసాలు 'మిలాన్-2026' సందర్భంగా గురువారం ఉదయం సింధియాలోని సాముద్రిక ఆడిటోరియంలో తొమ్మిది ఆసియాన్ దేశాల నౌకాదళాధిపతుల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక భేటీ అయ్యారు. స్వయం సమృద్ధి లక్ష్యంగా భారత్ అభివృద్ధి చేసిన రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆసియాన్ భాగస్వామ్య దేశాలను రాజ్‌నాథ్ సింగ్ ఆహ్వానించారు. ముఖ్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, విశాఖపట్నం క్లాస్ డిస్ట్రాయర్లు వంటి అత్యాధునిక నౌకలు భారత్ యొక్క 'బిల్డర్స్ నేవీ' సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. 1995లో కేవలం నాలుగు దేశాలతో ప్రారంభమైన మిలాన్ విన్యాసాలు, ఈ ఏడాది 74 దేశాల భాగస్వామ్యంతో అతిపెద్ద ఎడిషన్‌గా ఎదగడం గర్వకారణమన్నారు. ప్రాంతీయ భద్రతలో భారత్ ఎల్లప్పుడూ 'ఫస్ట్ రెస్పాండర్' (తొలి స్పందనకర్త)గా ఉంటుందని ఆసియాన్ ప్రతినిధులు కొనియాడారు. ఈ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు 'ఆసియాన్-ఇండియా డిఫెన్స్ థింక్-ట్యాంక్' చర్చలు, యువ నౌకాదళ అధికారుల మధ్య పరస్పర మార్పిడి కార్యక్రమాలను విస్తరించాలని రక్షణ మంత్రి ప్రతిపాదించారు. 'సౌభ్రాతృత్వం, సహకారం, సమన్వయం' అనే నినాదంతో, స్వేచ్ఛాయుతమైన, సమగ్రమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా ప్రతినిధులందరూ ప్రతిజ్ఞ చేశారు.

# పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత



(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సభ్యులతో వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశం అయ్యారు. ఇంజనీరింగ్ రంగ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు ఉత్పత్తి ప్రమాణీకరణ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించారు.

గుర్తించిన పారిశ్రామిక వాడల్లో సరైన పన్ను విధింపు కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించడం, ముడిసరుకు సరఫరా కోసం ఎన్ఎస్ఐసి సేవలను వినియోగించుకోవడం, సీజీటీఎంసిఈ పథకం కింద మరిన్ని ఎంఎస్ఎంఈ రుణాలకు గ్యారెంటీ కల్పించడం, చిన్న పరిశ్రమలకు నగదు లభ్యత కోసం టీఆర్ఈడీఎస్ అమలును వేగవంతం చేయడం. ఏపీసిపీడీసిఎల్ అమలు చేస్తున్న విద్యుత్ టారిఫ్ సమస్యలను పరిష్కరించడం, ఇంజనీరింగ్ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల పెంపు, ఉత్పత్తుల సేకరణ ధరలపై ఈ సందర్భంగా చర్చించడం జరిగింది. దీనిపై స్పందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సందర్భంగా సభ్యులకు పలు సూచనలు చేశారు. సభ్యుల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ఇతర రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈ విద్యుత్ టారిఫ్, ప్రాపర్టీ టాక్స్ విధింపులో ఉన్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి తగు పరిష్కారాన్ని కనుగొంటాము అని మంత్రి స్పష్టం చేసారు. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన విధంగా ఎంఎస్ఎంఈ'లకు ఎదురయ్యే సమస్యలను స్టేక్ హోల్డర్ల భాగస్వామ్యంతో పరిష్కరించడానికి, వారికి అండగా ఉండటానికి "కార్పొరేట్ మిత్ర" ఏర్పాటుపై తగిన ప్రతిపాదనలతో రావాలని మంత్రి ఛాంబర్స్ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కర్ రావు, బి. రాజశేఖర్, బయన వెంకటరావు, ఆర్.వి. సుబ్బారావు, గద్దె విజయ్ కుమార్, వెలగపూడి సాంబశివరావు, గుర్జీత్ సింగ్ సాహ్ని, కె.వి. సుబ్రహ్మణ్యం, మోహన్ పాటి సెంతుర్, జి. వకాల రావు, గుడివాడ జయ కుమార్, కోనేరు విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే విద్యా సంవత్సరంలో కర్నూలు క్లస్టర్ వర్సిటీ పూర్తిచేస్తాం

- **శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించి రూ. 139 కోట్లు మంజూరు కాగా, అందులో రూసా పథకం కింద రూ. 55 కోట్లు ఇప్పటికే ఖర్చుచేయడం జరిగింది. బ్యాలెన్స్ పనులు వచ్చే విద్యా సంవత్సరంలో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. శాసనసభలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... క్లస్టర్ యూనివర్సిటీలో పెండింగ్ పనులు పూర్తిచేయడానికి రూ. 74.5 కోట్లు అవసరమని తెలిపారు. ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్ అప్రోచ్ తో అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం వర్టికల్ - హారిజంటల్ ఇంటిగ్రేషన్ చేపట్టాల్సి ఉంది. అవసరమైన ఎకో సిస్టమ్ ను అక్కడ క్రియేట్ చేయాల్సి ఉంది. కర్నూలు పార్లమెంటులో కూటమి ప్రభుత్వం వచ్చాక పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్నాయి. ఇందులో భాగంగా స్పెషలైజేషన్ పై దృష్టిసారించడానికి కర్నూలులో క్లస్టర్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర విభజన తర్వాత నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలులో సిల్వర్ జూబ్లీ, కేవీఆర్ ఉమెన్స్ డిగ్రీ కాలేజి ఫర్ ఉమెన్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలను ఒకే గూటికిందకు తెచ్చి క్లస్టర్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. గతంలో ముఖ్యమంత్రి చొరవచూపి రూసా పథకం కింద రూ. 55 కోట్లు మంజూరు చేయించి, పనులు చేపట్టారు. భవనాల నిర్మాణం చేపట్టి ఎంఎస్ వైరాలజీ, కెమికల్ టెక్నాలజీ, ఎంసీఏ వంటి కోర్సులు ప్రారంభించేందుకు జగన్నాథగట్టు పక్కన 50ఎకరాల్లో క్లస్టర్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం క్లస్టర్ యూనివర్సిటీని నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 20 కోట్ల పెండింగ్ బిల్లులను కూడా మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టర్ ఇంతవరకు పనులు మొదలుపెట్టలేదు. కాంట్రాక్టర్ సెక్యూరిటీని కూడా తొలగించడంతో అక్కడి భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. తక్షణమే అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తిచేసి, కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే చరితారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ



(మొదటి పేజీ తరువాయి)

గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం ఛాంబరులో వీబీ జీ రామ్ జీ పథకంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వచ్చే సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న ఈ పథకాన్ని గ్రామీణ స్థాయిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులతో అనుసంధానించాలని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి పోయిన పెండింగ్ పనులు తక్షణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వేజ్ కాంపోనెంట్ కింద రూ. 4,619 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 1,962 కోట్లు వ్యయం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దేశవ్యాప్తంగా మెటిరియల్ కాంపోనెంట్ కింద వ్యయం చేసిన రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. డిమాండ్ డ్రివెన్ పథకంగా వీబీ జీ రామ్ జీ కింద రాష్ట్రానికి అవసరమైన పనులు చేపట్టేలా కార్యాచరణ చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు, జల్ జీవన్ మిషన్ కింద మరమ్మత్తులు, గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు, ఇతర ప్రజా భవనాల నిర్మాణం, ట్రాన్స్ పోర్టు షెడ్లు, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధి, కమ్యూనిటీ ఆస్తుల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. అలాగే నీటి భద్రత, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రకృతి విపత్తులను ఎదుర్కోనేందుకు చేపట్టే పనులను కూడా ఈ పథకం కింద చేపట్టవచ్చని పేర్కొన్నారు.

# ఉప్పాడ మత్స్యకారుల అభ్యున్నతికి సమగ్ర ప్రణాళిక



(మొదటి పేజీ తరువాయి)

సమగ్రంగా పరిశీలన చేసి పరిష్కార మార్గాలు అన్వేషించినట్లు పేర్కొన్నారు. తీర కాలుష్య నివారణ, సముద్ర కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, ఆధునిక పద్ధతుల్లో చేపల వేట, మార్కెటింగ్ సదుపాయాల విస్తరణ, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ వంటి అంశాలను ప్రణాళికలో భాగం చేసినట్లు తెలిపారు.

మత్స్యకారుల జీవితాలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీర గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు వివరించారు.

వివిధ శాఖల ఉన్నతాధికారులు, సముద్ర మత్స్యశాఖ నిపుణులు, జిల్లా అధికారుల సహకారంతో రూపొందించిన ఈ ప్రణాళికను త్వరలో పిఠాపురం పర్యటన సందర్భంగా అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిపారు.

నిర్దిష్ట లక్ష్యాలతో రూపొందించిన ఈ ప్రణాళిక ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షలకు పైగా ఉచిత వ్యవసాయ కనెక్షన్లు



(మొదటి పేజీ తరువాయి)

ఫీడర్ లెవల్ సోలార్ ప్రాజెక్టుల అమలుతో విద్యుత్ కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1059 కోట్లు ఆదా అవుతుందని పేర్కొన్నారు.

11 కేవీ లైన్ల దగ్గర సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా వినియోగదారులకు 25 సంవత్సరాల పాటు ఒకే విధమైన టారిఫ్‌తో విద్యుత్ అందించవచ్చని మంత్రి తెలిపారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్రాజెక్టుల కోసం భూ సేకరణ జరుగుతోందని, 1035 మెగావాట్ల సామర్థ్యానికి టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. రాబోయే మే నెల నుంచి సోలార్ ప్లాంట్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని మంత్రి స్పష్టం చేశారు. 2028--30 నాటికి 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్లాంట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు ఉదయం వేళల్లోనే 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించగలమని మంత్రి చెప్పారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార వర్గాలతో పాటు రైతులకు కూడా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే రాష్ట్ర విద్యుత్ శాఖ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

# ఉగాదికి డీఎస్సీ నోటిఫికేషన్!




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే తీపి కబురు చెప్పనుంది. రాష్ట్రంలో మరో డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. వచ్చే ఉగాది పండుగ కానుకగా ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తున్నట్లుగా సమాచారం. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో మొత్తం 3,600 పోస్టులు ఖాళీగా ఉన్నట్లుగా లెక్క తేలింది. ఆదర్శ పాఠశాలల్లో పీజీటీ, టీజీటీ పోస్టులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయ ఖాళీలు, సొసైటీ పరిధిలోని పాఠశాలల్లో బోధనా సిబ్బంది కొరత ఉండటంతో ప్రభుత్వం మరో డీఎస్సీ వేసేందు సన్నద్ధమవుతోంది.

సిలబస్‌లో మార్పుల్లేవు..! : ఈసారి డీఎస్సీ సిలబస్‌లో ఎలాంటి మార్పులు చేయడం లేదని తెలుస్తోంది. గతేడాది ప్రకటించిన సిలబస్‌నే ఈ నోటిఫికేషన్‌కు కూడా కొనసాగించే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థులు పాత మెటీరియల్‌తోనే తమ ప్రిపరేషన్‌ను కొనసాగించవచ్చు. గత డీఎస్సీ తరహాలోనే గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఇచ్చే చాన్స్ ఉంది. జనరల్ అభ్యర్థులకు 44 ఏళ్లు, రిజర్వేషన్ అభ్యర్థులకు (రాజ/రా/దీజ/జుబొ) 49 ఏళ్ల వరకు అవకాశం ఉండవచ్చు. ఈ నియామకాల్లో కూడా 'టెట్' మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. మిగిలిన 80 శాతం మార్కులు డీఎస్సీ పరీక్ష ఆధారంగా ఉంటాయి. ఈ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష పద్ధతిలోనే నిర్వహించనున్నారు.

ఆర్థిక శాఖ అనుమతికి.. : ప్రస్తుతం జిల్లాల వారీగా రిజర్వేషన్ల ప్రకారం రోస్టర్ పాయింట్లను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తవ్వగానే ఆర్థిక శాఖ అనుమతికి పంపిస్తారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత పరీక్షకు కేవలం 45 నుండి 60 రోజుల సమయం మాత్రమే ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్ కోసం వేచి చూడకుండా ఇప్పటి నుండే తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలి: చాంద్ బాష



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 24వ తేదీన జరగనున్న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు అంశాన్ని ఎజెండాగా చేర్చాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష ప్రభుత్వాన్ని కోరారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ, గత పీఆర్సీ ముగిసి దాదాపు 30 నెలలు గడిచినా ఇప్పటివరకు కొత్త వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందన్నారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రాధాన్యతతో చర్చించి తక్షణ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యక్తిగతంగా చొరవ చూపి 12వ పీఆర్సీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని చాంద్ బాష కోరారు.

# సూపర్‌సిక్స్ గాలికి పోయింది



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన కీలక హామీ సూపర్ సిక్స్ గాలికి కొట్టుకుపోయిందని, పేదలను మోసం చేశారని వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో లెక్కలన్నీ తప్పుల తడకలని, ప్రజలను మోసం చేశారని అన్నారు. 2014 నాటికి రూ. 1.47 లక్షలక్షల కోట్లు అప్పుందని, 2019 నాటికి రూ. 3.90 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. 2024లో వైసిపి దిగిపోయే నాటికి చేసిన అప్పు రూ. 3.31 లక్షల కోట్లని అన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల్లో రూ. 1.17 లక్షల కోట్ల అప్పు చేసిందని పేర్కొన్నారు. వీటిని లెక్కల్లో పారదర్శకంగా చూపించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 35 వేల కోట్ల బకాయిపడ్డారని, ఎన్నికల ముందు వాటిని ఇస్తానని చెప్పి ఇప్పటి వరకూ ఇవ్వలేదని తెలిపారు. యువతకు ఉపాధి లేదని, ఆడబిడ్డనిధి ప్రస్తావన లేదని పేర్కొన్నారు. ఎస్సి, ఎస్‌టి, బిసిలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఇంత వంకూ ఇవ్వకపోగా ఆరు లక్షల పెన్షన్లకు కోత పెట్టారని విమర్శించారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి పిల్లాడికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పి అందరికీ ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి లేదని, స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలను నిలువునా మోసం చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రతిసారీ పెన్షన్లు తగ్గించుకుంటూ వస్తున్నారని, బడ్జెట్లో పెన్షన్లకు నిధులు పెంచాల్సింది పోయి తగ్గించారని, ఆ లెక్కన మరో 7.45 లక్షల పెన్షన్లు రద్దు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని అర్థమవుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని, తల్లికి వందనం కేటాయిపుంల్లోనూ లక్షమందికి ఎగనామం పెట్టేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్నారని, దానికీ కోత విధించారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేసిన 21 రోజుల్లోనే డబ్బు జమచేశామని, ప్రస్తుతం ప్రభుత్వం ఇ-క్రాప్ తొలగించిందని, దళారులను తెచ్చిందని అన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వడ్డీలేని రుణాలకూ కోతపెట్టారని పేర్కొన్నారు.

**ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్‌దే :** ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్‌దేనని జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతి లడ్డూకోసం ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరా చేసిందని తెలిపారు. 2016లోనే ఎఆర్ డెయిరీకి అనుమతులు ఇచ్చారని, ఇటీవల వరకూ తమ ఉత్పత్తి సంస్థగా పేర్కొన్న డెయిరీని ఇటీవల విమర్శలు రావడంతో కో ప్రొడక్షన్ యూనిట్‌గా మార్చారని అన్నారు. బోలేబాబా కూడా హెరిటేజ్ అనుబంధంగా పనిచేస్తోందని, ఇండియా మార్ట్ ఇ-కామర్స్ సంస్థ వెబ్‌సైట్లో ఉందని తెలిపారు.

ఇందాపూర్ డెయిరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో సేల్స్‌హెడ్‌ను తొలగించారని అన్నారు. 2016లోనే ఇందాపూర్ డెయిరీ నెయ్యి నాణ్యత లోపించిందని డిస్‌క్వాలిఫై చేసి వెంటనే క్వాలిఫై చేశారని అన్నారు. బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ హర్ష్‌డెయిరీ ఒకటేనని తెలిపారు. గతంలో రిజక్ట్ అయిన ట్యాంకర్లు శ్రీకాళహస్తి సమీపంలోని క్రషర్‌లో ఉన్నాయని, తిరిగి అవే తిరుమలకు వైష్ణవి డెయిరీ పేరుతో వెళ్లాయని తెలిపారు. ఈ తతంగం మొత్తం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే జరిగిందని అన్నారు.

# త్వరలో ఆయుష్ వైద్యుల ఎంపిక జాబితా వెల్లడి

- 72 ఆయుష్ వైద్యుల పోస్టులకు 2,430 దరఖాస్తులు
- ఒక్కో పోస్టుకు 34.1 మంది చొప్పున పోటీ
- అత్యధికంగా హోమియో వైద్యుల ఉద్యోగాలకు డిమాండ్
- జిల్లాల వారీగా మరో 286 పారా మెడికల్, అడ్మినిస్ట్రేషన్, ఇతర పోస్టుల భర్తీకి చర్యలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆయుష్ శాఖలో వైద్యుల పోస్టుల భర్తీ త్వరలో జరుగనుంది. ఆయుర్వేద, హోమియో, యూనాని కేటగిరిల్లో ఒప్పంద విధానంలో రాష్ట్ర స్థాయిలో 72 పోస్టుల భర్తీ కోసం జారీచేసిన నోటిఫికేషన్ అనుసరించి వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా మెరిట్ ప్రాతిపదికన నియామకాల జాబితా సిద్ధమవుతోంది. త్వరలో జాబితా ప్రకటించి కౌన్సెలింగ్ ద్వారా ఎంపికైన వారికి పోస్టింగులు ఇవ్వనున్నారు. ఇవి కాకుండా మరో 286 పారా మెడికల్ , ఇతర పోస్టుల భర్తీ ఒప్పంద/పొరుగు సేవల విధానంలో జిల్లాల వారీగా రీజినల్ డిప్యూటీ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో భర్తీ జరుగుతుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఆయుష్ శాఖ నుంచి త్వరలో జిల్లాల కలెక్టర్లకు వెళ్లనున్నాయి.

ఆయుర్వేద డిస్పెన్సరీలు, ఆసుపత్రుల్లో చాలాకాలం నుంచి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, వైద్య సేవల అవసరాల గురిశీచి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష సమావేశం ద్వారా తీసుకువెళ్లారు. పోస్టుల భర్తీకి సీఎం వెంటనే ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియామక నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెలలో జారీచేసిన ఆయుష్ వైద్యుల పోస్టుల భర్తీ నోటిఫికేషన్ కు అభ్యర్థుల నుంచి భారీ స్పందన కనిపించింది. 72 పోస్టులకు కలిపి 2,430 మంది (34.1%) దరఖాస్తుచేశారు. ఇందులో 1,669 మంది మహిళలు ఉండడం గమనార్హం.

**ఒక్కో హోమియో పోస్టుకి 47.1% మంది పోటీ :** ఆయుర్వేద కేటగిరిలో 36 పోస్టుల భర్తీకిగాను 1,086 మంది దరఖాస్తు చేశారు. ఒక్కో పోస్టుకు 30.1% మంది అభ్యర్తులు పోటీపడ్డారు. హోమియో కేటగిరిలో ప్రకటించిన 26 పోస్టులకు 1,219 మంది దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు 47.1% మంది చొప్పున పోటీపడుతున్నారు. 10 యూనాని పోస్టులకుగాను 125 మంది దరఖాస్తుచేశారు. ఒక్కో పోస్టుకు 12.5% మంది పోటీపడ్డారని ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.

**పారా మెడికల్, అడ్మినిస్ట్రేషన్ పోస్టుల భర్తీకి కూడా చర్యలు :** పొరుగు, ఒప్పంద విధానంలో భర్తీ చేయనున్న 286 పోస్టుల్లో పంచకర్మ థెరపిస్ట్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, యోగ ఇనస్ట్రాక్టర్స్, మసాజిస్ట్, జిల్లా ప్రొగ్రాం మేనేజర్ , అడ్మినిస్ట్రేషన్, ఇతర పోస్టులు ఉన్నాయి. ఇందులో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ కింద ఉన్న 112 పోస్ట్స్ ఉన్నాయి. వీటిని గతంలో పని చేసి విధులకు దూరమైన కాంపౌండర్లు, ఇతరులతో నిబంధనలు అనుసరించి భర్తీ చేస్తారు.

# 200 మందికి ఉచితంగా మూడేళ్లపాటు 'సివిల్స్'లో శిక్షణ

- బ్రోచర్ను రిలీజ్ చేసిన మంత్రులు సత్యకుమార్, పార్థసారథి
- నిర్వాహకులకు మంత్రుల అభినందనలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఉచిత సివిల్స్ శిక్షణ దరఖాస్తుల స్వీకరణ బ్రోచరు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సమాచార శాఖ మంత్రి పార్థసారథి సచివాలయంలో గురువారం విడుదల చేశారు. మంత్రి సత్య కుమార్ చాంబర్లో ఈ కార్యక్రమం జరిగింది.

చలసాని బలరామ ప్రసాద్ (సీబీఆర్) అకాడమీ ద్వారా ఎంపిక కాబోయే 200 మంది అభ్యర్థులకు మూడేళ్లపాటు ఉచిత వసతి, బస సదుపాయాలతో శిక్షణ ఇవ్వడాన్ని మంత్రులు స్వాగతించారు. యూపీపీఎస్సీ, ఏపీపీఎస్సీ (ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1,2) ఇతర ఉద్యోగ నియామకాలకు అభ్యర్థులను సన్నద్ధం చేస్తామని డాక్టర్ లక్ష్మయ్య (ఐఏఎస్ స్టడీ సర్కిల్ )వెల్లడించారు. 200 మందిలో వంద మంది అమ్మాయిలు ఉంటారని పేర్కొన్నారు. వచ్చేనెల 15న అమ్మాయిలు, ఏప్రిల్ 5న యువకులకు విడివిడిగా శిక్షణ కోసం ఎంపిక రాత పరీక్షలు నిర్వహించనున్నారు. వీటి ద్వారా ఎంపిక చేసిన వారికి మౌఖిక పరీక్షలు కూడా జరుపుతారు. వీటిల్లో చూపించే ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు

**విజయవాడ, వినుకొండలో శిక్షణ కేంద్రాలు :** విజయవాడలోని కేశీద్రంలో అమ్మాయిలకు, వినుకొండలోని కేంద్రంలో అబ్బాయిలకు శిక్షణ ఇస్తారు. ప్రముఖ సామాజిక సేవకుడు చలసాని బలరామ ప్రసాద్ (84 ఏళ్లు) అభ్యర్థులకు ఉచిత భోజన, బస సదుపాయాన్ని కల్పిస్తుండగా డాక్టర్ లక్ష్మయ్య ఐ ఎ.ఎస్ స్టడీ సర్కిల్ వారు ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఒక్కో అభ్యర్థికి మూడేళ్లపాటు ఉచిత వసతి, బస సదుపాయాలతో శిక్షణ ఇచ్చినందుకు సుమారు రూ. 10 లక్షల వరకు వ్యయమవుతుంది.

**మంత్రి సత్యకుమార్ స్ఫూర్తితో...:** మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ, ఔదార్యంతో ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎంపికచేసిన 28 మంది అమ్మాయిలు ప్రస్తుతం సివిల్స్ కు ఉచితంగా గత 9 నెలల నుంచి హైదరాబాదులో డాక్టర్ లక్ష్మయ్య సంస్థ ద్వారా శిక్షణ పొందుతున్నారు. మరో రెండేళ్లపాటు వీరికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ స్ఫూర్తి కొనసాగింపుగా మరో 200 మందికి శిక్షణ ఇచ్చే కార్యక్రమం జరగబోతుంది. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజుల రెడ్డి, కూడా పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం వర్సిటీలో మెటీరియల్స్ జీనోమ్‌పై అంతర్జాతీయ సదస్సు






- దేశ విదేశాల నుంచి హాజరైన పేరున్న శాస్త్రవేత్తలు
- నూతన పరిశోధనల అభివృద్ధిపై చర్చాగోష్టులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి మెటీరియల్స్ జీనోమ్ పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు వింధ దేశాల నుంచి వందమందికి పైగా పేరున్న శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని ఫిజిక్స్ విభాగం ఈ సదస్సును ఏర్పాటు వేసింది. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, యూనివర్సిటీ రీసర్చ్ డీన్ ఆచార్య రంజిత్ థాపాలు సదస్సు నిర్వహణను పర్యవేక్షించారు.

జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన మెటీరియల్స్ జీనోమ్ సదస్సు సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగించింది. యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ ఆచార్య రంజిత్ థాపా మాట్లాడుతూ, 2020 నుంచి రెండేళ్ల కోసారి ఎస్ఆర్ఎం వర్సిటీలో మెటీరియల్స్ జీనోమ్ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ ద్వారా కంప్యూటేషనల్ మెటీరియల్స్ పరిశోధనలను అభివృద్ధి చేయడానికి ఈ తరహా సదస్సులు నిర్వహిస్తున్నానున్నారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఎమర్జింగ్ టెక్నాలజీ, క్వాంటమ్, ఏఐ టెక్నాలజీల అభివృద్ధి, విద్యార్థుల అవగాహనపై దృష్టి సారిస్తున్నానన్నారు. కోల్ కతా నుంచి విచ్చేసిన ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆచార్య జీపీ దాస్, బెంగళూరు ఐఐఎస్సీ శాస్త్రవేత్త మరియు సీఎస్ఐఆర్ భట్నాగర్ అవార్డు గ్రహీత ఆచార్య డిడి శర్మ, ప్రొఫెసర్ స్టెఫాన్ సాన్విభో' (ఐర్లాండ్)లు హాజరై వేదికపై నుంచి పరిశోధనలకు చెందిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మెటీరియల్స్ జీనోమ్ సదస్సు వివరాలను వెల్లడించే ప్రత్యేక సంచికను వక్తలు ఆవిష్కరించారు. కృత్రిమ మేధ ఆధారిత అయస్కాంత పదార్థాల ఆవిష్కరణ, కంప్యూటేషనల్ మెటీరియల్ సైన్స్ లో పురోగతి, శక్తి అనువర్తనాలు వంటి కీలక అంశాలపై పలువురు శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. జపాన్, రష్యా స్పెయిన్, డెన్మార్క్, సింగపూర్, యూకే, యూఎస్సీ తదితర 13 దేశాల నుంచివర్ధమాన పరిశోధకులు, శాస్త్రవేత్తలు సదస్సుకు హాజరయ్యారు. అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ వంటి సంస్థలు, ఏజెన్సీలు సదస్సు నిర్వహణకు సహకారం అందిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన డాక్టర్ మహేష్ రవ్వా, డాక్టర్ అనిత హాల్ ధర్ లు సదస్సుకు కో కన్వీనర్లుగా వ్యవహరించారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచన మేరకు విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా కిలారి దిలీప్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ భారతదేశంలో హిందూ ధర్మ పరిరక్షణకు అంకితభావంతో కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. యుద్ధనీతిలో మహిళల పట్ల ఆయన చూపిన గౌరవం, అసాధారణమైన శౌర్యం మరియు ధైర్యసాహసాలు ఆయనను మహోన్నత రాజుగా నిలబెట్టాయని పేర్కొన్నారు. భారత చరిత్రలో స్వరాజ్య స్థాపకుడిగా, ధర్మ పరిరక్షకుడిగా, ప్రజాహిత పాలకుడిగా శివాజీ మహారాజ్‌కు విశిష్ట స్థానం ఉందన్నారు.

"హిందవి స్వరాజ్య" లక్ష్యంతో స్వదేశీ పరిపాలనను స్థాపించిన శివాజీ మహారాజ్ ఆ కాలంలో ఉన్న రాజకీయ, మతపరమైన సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని హిందూ సంప్రదాయాలు, దేవాలయాలు, సంస్కృతిని రక్షించారని తెలిపారు. ప్రజలకు తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరించే హక్కును కల్పించారని చెప్పారు.

హిందూ ధర్మంపై అచంచల భక్తి ఉన్నప్పటికీ ఇతర మతాల పట్ల గౌరవ భావం ప్రదర్శించారని, వివిధ మతాల వారికి సైన్యంలో మరియు పరిపాలనలో అవకాశాలు కల్పించి సమాన న్యాయం అందించారని వివరించారు. ఇది ఆయన విశాల దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు.

శివాజీ మహారాజ్ పరిపాలనలో క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చి, రైతుల సంక్షేమం, మహిళల రక్షణ, సైనికుల నైతిక నియమాలను కచ్చితంగా అమలు చేయించారని తెలిపారు. సమర్థమైన ఆదాయ వ్యవస్థను అమలు చేసి, బలమైన నౌకాదళాన్ని ఏర్పాటు చేసి రాజ్యాన్ని రక్షించారని చెప్పారు. గెరిల్లా యుద్ధ తంత్రాలతో శత్రువులను ఎదుర్కొని, కోటల ఆధారిత రక్షణ వ్యవస్థను బలోపేతం చేసి స్వరాజ్యాన్ని స్థిరపరిచారని పేర్కొన్నారు.

ఈ జయంతి సందర్భంగా శివాజీ మహారాజ్ విలువలైన ధర్మం, న్యాయం, సమానత్వం, స్వరాజ్య భావనలను మన జీవితాల్లో ఆచరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక వృద్ధే లక్ష్యం!




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆదాయాన్ని సమపార్జించుకోవడంతోపాటు, పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించడమే బడ్జెట్ లక్ష్యమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు శాసనసభలో ఆయన గురువారం సమాధానం ఇస్తూ సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్రం ఇప్పటికే ముందుందని, పేదలను ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లడం, ఆదాయ సముపార్జన, పారిశ్రామిక వృద్ధి, విజన్ 2047 లక్ష్యంగా బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం అన్ని శాఖల్లోనూ అప్పులు మిగిల్చి వెళ్లిందన్నారు. రుణాలపై వడ్డీరేట్లు తగ్గించేలా చూస్తున్నామని, దీనికోసం సంప్రదింపులూ చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్సైజ్‌శాఖలో 33 శాతం, మైనింగ్‌లో 24 శాతం ఆదాయం పెరిగిందని చెప్పారు. రాయలసీమలో ప్రాజెక్టులు దెబ్బతింటే వైసిపి పట్టించుకోలేదని, హంద్రీనీవాను 12 పంపులతో నడుపుతున్నామని తెలిపారు. పట్టిసీమపై దుష్ప్రచారం చేశారని, ఆ ప్రాజెక్టు రూ. 44 వేల కోట్ల సంపద సృష్టించిందని అన్నారు. అలాగే 70 వేల కోట్ల విలువైన రైల్వేలైన్ వేస్తున్నట్లు చెప్పారు. ఈ సమయంలో ప్రసంగం ముగింపు చేయబోగా, ఐదు నిముషాలు కొనసాగించాలని స్పీకర్ కోరారు. దీంతో పయ్యావుల ప్రసంగాన్ని కొనసాగిస్తూ గత ప్రభుత్వ పాలనలో ఆదాయం మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లేదని అన్నారు. ఒక్కటితో రాష్ట్రాన్నిముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. అప్పటి పాలనకు ఇప్పటి పాలనకు తేడా గమనించాలన్నారు. అంతకుముందు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషా మాట్లాడుతూ బడ్జెట్ ఐదు కోట్ల ఆంధ్రుల తలరాతను మారుస్తుందని చెప్పారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య మాట్లాడుతూ బడ్జెట్లో సూపర్‌సిక్స్‌కు ప్రాధాన్యత కనిపిస్తోందని పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం స్పష్టంగా కనిపిస్తోందని వివరించారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ సామాన్యుల సంక్షేమం, వ్యవసాయాన్ని భుక్తిగా కాకుండా భక్తిగా మార్చారని అన్నారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సర్వాంధ్ర సాధన లక్ష్యంగా ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకువస్తుందని తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఖర్చు పెరగలేదని, పెట్టుబడి పెరిగిందని అదే నిజమైన బడ్జెట్ అని అన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక విధ్వంసం నుండి అభివృద్ధివైపు రాష్ట్రం నడుస్తోందన్నారు. అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ 20 నెలల పాలనలో సిఎం చంద్రబాబు ఆలోచనతో రాష్ట్రం సంపద సృష్టివైపు వెళుతోందని అన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ కృష్ణానదిపై వైకుంఠపురం వద్ద నిర్మించే బ్రిడ్జి ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి మరింత పెరుగుతుందని తెలిపారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి బడ్జెట్ ప్రతిరూపమని అన్నారు. బిజెపి ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుందని చెప్పారు.

# 'సాక్షి'పై హెరిటేజ్ పరువు నష్టం దావా




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల తిరుపతి దేవస్థానాలు (టిటిడి)కి నెయ్యి సరఫరా వ్యవహారంలో తమపై తప్పుడు కథనాలు రాశారంటూ సాక్షి మీడియా సంస్థపై ఢిల్లీ హైకోర్టులో హెరిటేజ్ సంస్థ పరువునష్టం పిటిషన్ దాఖలు చేసింది. రూ. కోట్లకు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం సంబంధిత వెబ్ లింకులను తక్షణమే తొలగించాలని 'సాక్షి'కి ఆదేశాలు జారీ చేసింది. భోలే బాబా డెయిరీ నెయ్యి వివాదంతో తమ సంస్థకు ఎటువంటి సంబంధం లేదని, హెరిటేజ్ ప్రతిష్టను దెబ్బతీసేలా, పూర్తి అసత్యాలతో కథనాలు ప్రచురించారని హెరిటేజ్ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ పిటిషన్‌ను గురువారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మినీ పుష్కరణ ధర్మాసనం విచారించింది. హెరిటేజ్ ఫుడ్స్‌కి, బోలెబాబా డైరీకి సంబంధం ఉందనే సాక్షి మీడియాలో వచ్చిన కథనాలను 24 గంటల్లో అన్ని లింక్‌లు తొలగించాలని ఆదేశించింది. లేనిపక్షంలో మెటా, గూగుల్, యూట్యూబ్ సంస్థలు చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చింది. సాక్షి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్



**రాయ్‌పూర్ (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వారు వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు హతమైనట్టు భద్రతా దళాలు భావిస్తున్నాయి. అయితే ఉన్నతాధికారులు, మావోయిస్టు పార్టీ ధృవీకరించలేదు. మావోయిస్టు నేత దేవ్ జీ ఉన్నారనే సమాచారంతో సుమారు ఐదు వేల మంది భద్రతా దళాలను కర్రెగుట్టలో మోహరించారు.

దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మావోయిస్టులకు, బలగాలకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి కర్రెగుట్టల్లోకి మావోలు ప్రవేశించారంటూ నిఘా సంస్థల నుండి సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టగా ఎదురుకాల్పులు జరిగాయి. మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం చర్యలను వేగవంతం చేసింది. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మతిచెందగా.. వేలాది మంది వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. పలువురు మావోయిస్టులను ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర కమిటీ సభ్యులు దేహార్ మిశ్రా, దేవ్‌జీ, గణపతి సజీవంగా ఉన్నట్టు సమాచారం.. మరోవైపు జాతీయ దర్యాప్తు సంస్థ ( ఎన్ఐఎ) కూడా మావోయిస్టుల కీలకనేతల వివరాలపై దృష్టిసారించింది. తాజా పరిస్థితులను కేంద్ర హోం శాఖకు నివేదిస్తుంది.



## ప్రాంగణ ఎంపికల్లో కెబిఎన్ విద్యార్థులు

**విజయవాడ, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రముఖ పరిశ్రమలు తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన తమ కళాశాల విద్యార్థులు 33 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కె.బి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన హెటిరో డ్రగ్స్ సంస్థ నిర్వహించిన ఎంపికల్లో ఎం.ఎస్ సి (కెమిస్ట్రీ) విద్యార్థులు 21 మంది రూ. 3 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు చెప్పారు. ప్లేస్ మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హైదరాబాదు, విశాఖపట్నం కేంద్రాలుగా పనిచేసే నోవోపార్ లాబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన పరీక్షల్లో ఎం.ఎస్ సి (కెమిస్ట్రీ) విద్యార్థులు 12 మంది రూ. 3 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసుకునే సమయంలోనే తమ విద్యార్థులకు ఉద్యోగాల కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ ప్లేస్మెంట్ ఆఫీసర్ రమేష్, పి.జి.కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేశ్, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు కూడా విద్యార్థులను అభినందించారు.

## సీబీజీ ప్లాంటును పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**కంచికచర్ల, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

కంచికచర్ల మండలం, పరిటాలలో ఏర్పాటుచేస్తున్న రిలయన్స్ న్యూ ఎనర్జీ - కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం సందర్శించారు. 30 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్లాంటును త్వరలో గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించే అవకాశమున్నందున ప్లాంటులో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజుకు 22 టన్నుల సీబీజీ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంటును సిద్ధం చేస్తున్నట్లు ప్లాంటు సిబ్బంది వివరించారు. స్థానిక వ్యవసాయ వ్యర్థాలు, మునిసిపల్ ఘన వ్యర్థాలు వంటి వాటిని ఉపయోగించి పర్యావరణ హిత ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు ఇలాంటి ప్లాంటులు దోహదం చేస్తాయన్నారు. ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కూడా చేయూతనిస్తాయన్నారు. కర్బన ఉద్గారాలకు కళ్లెం వేయడంతో పాటు రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీబీజీ ప్లాంట్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, సంస్థ డీజీఎం శ్రీకాంత్, మేనేజర్ శ్రీచరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిట్టిబాబు ఉన్నారు.

### సీబీఎస్సీ పాఠశాలగా
## గుర్తింపు పొందిన "ఏకత్వా"

- నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు గుర్తింపు పొందిన మొదటి పాఠశాలగా ఏకత్వా







**నందిగామ, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

నందిగామ నియోజకవర్గంలోని వీరులపాడు మండలం, పొన్నవరం గ్రామంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించిన ఏకత్వా పాఠశాల స్థాపించిన మొదటి ఏడాది నుండే పాఠశాల విద్యలో ఉన్నత స్థాయి ప్రమాణాలతో చరిత్ర సృష్టించిన విద్యా సంస్థగా నియోజకవర్గంలో, జిల్లాలో కూడా పేరుప్రఖ్యాతులు పొందింది. క్రీడారంగంలో అయితే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను జాతికి అంకితం చేసి రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలగా నిలిచింది. నందిగామ ప్రాంతంలో ఇంటర్మీడియట్ విద్యకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన చైతన్య విద్యా సంస్థల అధినేత అమరనేని రమేష్ బాబు నేతృత్వంలో, యువ విద్యావేత్త డాక్టర్ అమరనేని మనోజ్ సారధ్యంలో ఏర్పాటు చేసిన ఏకత్వా పాఠశాల ప్రారంభం నుండే కేవలం విద్యార్థులపై చదువు, మార్కులు, ర్యాంక్ లని రుద్దడం కాకుండా విద్యార్థులు ఆట, పాట, సంస్కృతిక ఇలా అన్న రంగాలలో విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఉన్నతమైన ఆశయంతో అహర్నిశలు శ్రమిస్తున్న ఏకత్వా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు బృందం అంకిత భావానికి నిదర్శనంగా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఇ గుర్తింపు సాధించిన పాఠశాల గా ఏకత్వ పాఠశాల సరికొత్త చరిత్ర సృష్టించింది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఇ గుర్తింపు సాధించిన ఏకత్వ పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి చైర్మన్ రమేష్ బాబు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో ఈ ప్రాంతం విద్యా రంగంలో మరిన్ని మైలు రాళ్లను సాధించాలని ఆకాక్షించారు.

## పేద కుటుంబానికి అండగా నిలిచిన వైఎన్ఆర్ చారిటీస్



**ఎనికేపాడు, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

ఎన్టీఆర్ జిల్లా, గన్నవరం నియోజకవర్గం, ఎనికేపాడు లోని జీవనోపాధి కోసం ఇబ్బంది పడుతున్న ఒక పేద కుటుంబానికి వైఎన్ఆర్ చారిటీస్ బాసటగా నిలిచింది. గన్నవరం నియోజకవర్గం ఎనికేపాడు గ్రామంలోని విజయా ఆగ్రో కట్టపై నివాసం ఉంటున్న ఎలక్ట్రీషియన్ టిక్కిలి రంగబాబు, అతని భార్య కృష్ణకుమారి తమ జీవనోపాధి కోసం ఒక కూరగాయల బండి కావాలని వైఎన్ఆర్ చారిటీస్ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ ను కోరారు. వారి విన్నపానికి సానుకూలంగా స్పందించిన జయప్రకాష్, బుధవారం వారికి కూరగాయల బండిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనివ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాదు బోసుబాబు, మాధవ, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బహుళ ప్రయోజనాల సూక్ష్మ సేద్యం

- రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు
- అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎ.కొండూరు, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

సూక్ష్మ సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయడం, అధిక దిగుబడులు సాధించడం వంటి బహుళ ప్రయోజనాలు ఉంటాయని.. ఈ నేపథ్యంలో అన్నదాతలు ప్రభుత్వం అందిస్తున్న సూక్ష్మ సేద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం తిరువూరు ఆర్డీవో కె.మాధురి, అధికారులతో కలిసి ఎ.కొండూరు మండలం, రేపూడి గ్రామ పంట పొలాలను సందర్శించారు. సూక్ష్మ సేద్యం పథకం ద్వారా ప్రయోజనం పొందుతూ రైతు జి.విష్ణు వర్ధన్‌రెడ్డి సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను, పరికరాల ను పరిశీలించారు. పథకం ప్రయోజనాలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో సాగునీటి యాజమాన్యం చాలా ప్రధానమైనదని.. సాగునీటి వనరుల సద్వినియోగంలో బిందు సేద్యం, తుంపర సేద్యం చాలా కీలకమైనవన్నారు. 2025-26లో 2,200 హెక్టార్లకు రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలను అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకాన్ని విజయవంతంగా అమలుచేస్తున్నామన్నారు. ఈ లక్ష్యానికి మించి కూడా 3,500 హెక్టార్ల వరకు రైతులకు ప్రయోజనం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏడు కంపెనీల ద్వారా పరికరాలు అమర్చు తున్న వివరించారు. సాగునీరు, కరెంటు వినియోగంలో 50 శాతం పొదుపుతో పాటు ఉన్న నీటితో ఎక్కువ విస్తీర్ణానికి నీరు అందించడం సూక్ష్మ సేద్యంతో సాధ్యమవుతుందని.. భూసారానికి, భూ సమతుల్యతకు ఎలాంటి హానీ కలగకుండా సాగువ్యయంలో దాదాపు 40 శాతాన్ని ఈ విధానంతో ఆదా చేసుకోవచ్చన్నారు. మామిడి, జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, కొబ్బరి వంటి పంటలతో పాటు కూరగాయలు, పూల తోటలకు కూడా సూక్ష్మ సేద్యం బాగుంటుందన్నారు. సూక్ష్మ సేద్యం వల్ల ఎకరా మొక్కజొన్నకు దాదాపు ఏడు క్వింటాళ్ల మేర అదనపు దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా మొక్కజొన్న సాగుకు ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాలు, ఏపీ ఎంఐపీ కార్యాలయం ద్వారా వివరాలు పొంది, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరం మేరకు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల స్థూల జోడింపు విలువ (జీవీఏ)లో వృద్ధికి సూక్ష్మ సేద్యం విధానాలు కూడా ఉపయోగపడతాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ వెంట ఏపీ ఎంఐపీ పీడీ పి.ఎం.సుభాని, ఉద్యానశాఖ అధికారి నరేంద్ర కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ రంగారావు, సూక్ష్మ సేద్య పథకం జిల్లా కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

### దేశంలో ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన..
# మొట్టమొదటి హోమియోపతి బ్రాండ్‌గా 'అద్వెన్ బయోటెక్'

**ప్రధాని మోదీ 'గ్లోబల్ ఆయుష్' దార్శనికతకు బలం**




**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

భారతీయ సంప్రదాయ వైద్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించబడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'గ్లోబల్ ఆయుష్' దార్శనికతకు అనుగుణంగా అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆరోగ్య సంరక్షణ అందించాలన్న సంకల్పానికి నిదర్శనంగా 'అద్వెన్ బయోటెక్' ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్) ప్రమాణాలతో గుర్తింపు పొందిన మొట్టమొదటి హోమియోపతి బ్రాండ్‌గా అవతరించింది. హోమియో పతి మందుల తయారీలో అంతర్జాతీయ స్థాయి కచ్చితత్వం, పారదర్శకతను ప్రవేశపెట్టిన ఈ బ్రాండ్ ఇప్పటికే 'ఆయుష్ ప్రీమియం మార్క్'ను కూడా సొంతం చేసుకుంది. ఈ రెండూ ప్రతిష్టాత్మక గుర్తింపులు సాధించిన ఏకైక సంస్థగా నిలిచింది. ఈ సందర్భంగా అద్వెన్ బయోటెక్ సీఈఓ ఆదేశ్ శర్మ మాట్లాడుతూ సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఆయుష్ విధానాన్ని సైన్స్, నాణ్యత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విశ్వసనీయ గ్లోబల్ హెల్త్‌కేర్ సిస్టమ్‌గా మార్చాలన్న ప్రధాని మోదీ ఆకాంక్షకు ఈ విజయం బలాన్ని చేకూరుస్తుందన్నారు. హోమియోపతి ఔషధాల తయారీలో నాణ్యతపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ.. కచ్చితత్వం, పారదర్శకత, విశ్వసనీయతలో అద్వెన్ బయోటెక్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అద్వెన్ నాణ్యత నియంత్రణ, పరీక్షా ప్రయోగ శాలలు అత్యున్నత జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను కలిగి ఉన్నాయని ధృవీకరించబడిందన్నారు. ఈ సర్టిఫికేషన్ వల్ల డాక్టర్లు, రోగులలో నమ్మకం పెరగడమే కాకుండా అంతర్జాతీయ మార్కె ట్లలో భారతీయ హోమియోపతికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. భారతీయ వైద్య విధానాలు శాస్త్రీయత, నాణ్యతతో ప్రపంచ వేదికలపై నిలబడాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన విజన్ అన్నారు. ఈ గుర్తింపు కేవలం అద్వెన్‌కు దక్కిన గౌరవం మాత్రమే కాదని, సురక్షి తమైన, ప్రభావవంతమైన వైద్యం కోసం హోమియో పతిని నమ్ముతున్న లక్షలాది మంది రోగులకు ఒక భరోసా అన్నారు. హోమియోపతి ప్రాథమిక సూత్రా లను దెబ్బ తీయకుండా ఈ వైద్య విధానాన్ని ఆధునీకరి ంచాలన్న లక్ష్యంతో అద్వెన్ బయోటెక్ స్థాపించ బడిందన్నారు. పరిశోధన ఆధారిత ఫార్ములేషన్లు, నైతిక విలువలు, అధునాతన తయారీ వ్యవస్థలపై ఈ సంస్థ నిరంతరం దృష్టి సారిస్తోందన్నారు. ఈ సర్టిఫికేషన్‌తో అద్వెన్‌లోని ప్రతి పరీక్ష, ప్రతి ప్రక్రియ, ప్రతి మందు ప్రపం చవ్యాప్తంగా ఆమోదించబడిన ప్రోటోకాల్స్ ద్వారా ధృవీకరించబడుతున్నాయని తెలిపారు. దీనివల్ల మెట్రో నగరాల్లోనే కాకుండా, చిన్న నగరాలు, పట్టణాల్లోని రోగులకు కూడా మరింత నాణ్యత, మెరుగైన ఫలితాలు, గొప్ప నమ్మకాన్ని కలిగిస్తాయన్నారు. ప్రజలకు ఇప్పుడు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన హోమి యోపతి మందులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

# రైల్వే స్టేషన్లలో దివ్యాంగులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలి

- డీఆర్ఎంకు కిరణ్ రాజ్ బందెల వినతి





**విజయవాడ, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లలో దివ్యాంగులకు సమగ్ర సౌకర్యాలు కల్పించాలని దివ్యాంగుల హక్కుల సాధన సమితి జాతీయ అధ్యక్షులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ రాజ్ బందెల కోరారు. ఈ మేరకు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) శ్రీనివాస్ రావుని కలిసి బుధవారం వినతి పత్రం సమర్పించారు. దివ్యాంగుల రాకపోకలకు అనుకూలంగా ప్రతి రైల్వే స్టేషన్‌లో ర్యాంపులు, వీల్‌చైర్లు, ప్రత్యేక సహాయక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే శాఖ అందించే సబ్సిడీ రాయితీ ప్రయాణ పాసులను ఆన్ లైన్ లతో పాటు ఆఫ్ లైన్ విధానంలో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని సూచిం చారు. దివ్యాంగులకు కేటాయించిన భోగీల్లో సీట్లను ఇతరులు వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రయాణ సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం ప్రతి రైల్వే స్టేషన్‌లో దామాషా ప్రకారం దివ్యాంగులకు దుకాణాలు, స్టాల్స్, సైకిల్--స్కూటర్ పార్కింగ్ స్టాండ్‌లలో నామినేషన్ పద్ధతిలో అవకాశాలు కల్పించాలని అభ్యర్థించారు. అలాగే దివ్యాంగులకు అనుకూలమైన టాయిలెట్లు, ఆధునిక లిఫ్టులు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై డీఆర్ఎం సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కిరణ్ రాజ్ బందెల తెలిపారు.

# ఘనంగా గొడ్డంటి నారాయణరావు జన్మదిన వేడుకలు

- విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ
- ఉచిత విద్యా కార్యక్రమాలపై అవగాహన






**విజయవాడ, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడ వన్‌టౌన్ భవన్నారాయణ వీధి సమీపంలోని న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ కార్యాలయంలో కీర్తిశేషులు గొడ్డంటి నారాయణరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యాపారవేత్త, బాలాజీ స్వీట్స్ అధినేత కన్నమర్లపూడి సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ధీటి ప్రభుదాస్ (48, 49 డివిజన్ల క్లస్టర్ ఇంచార్జ్) హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని జయించాలంటే ముందస్తు ప్రణాళికతో చదవాలని, ఏకాగ్రతతో పాఠాలను అర్థం చేసుకొని అభ్యసిస్తే విజయం సొంతమవుతుందని సూచించారు. ఇంటర్ మరియు పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షిస్తూ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సరస్వతి పూజలో ఉంచిన పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, పుస్తక బ్యాగులను పంపిణీ చేశారు. సంస్థ నిర్వహిస్తున్న ఉచిత విద్యా కార్యక్రమాల గురించి వివరించి, సభ్యుల కృషిని ప్రశంసించారు. ముఖ్యంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి సాయి వినయ్ కుమార్ తన తండ్రి జన్మదినాన్ని ప్రతి సంవత్సరం "పితృ దేవోభవ" కార్యక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థుల చదువుకు తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ప్రముఖులను ఆహ్వానించి విద్యార్థులకు మార్గదర్శక సూచనలు అందించడం, సమయపాలనపై అవగాహన కల్పించడం ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పోలీస్ వ్యవస్థలో చిన్న ఉద్యోగిగా పనిచేస్తూనే సమాజానికి సేవ చేస్తున్న సాయి వినయ్ కుమార్ కృషి ఆదర్శనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ప్రముఖులు ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని సంస్థ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, ప్రజ్వల హోం మల్లికా, సంస్థ సభ్యుడు గౌతం పర్యవేక్షించి విజయవంతం చేశారు.

# మౌలాలి ఆర్ఎఫ్‌సీ ముందు స్ట్రీట్ లైట్ల ముప్పు

## స్తంభాలపై వేలాడుతున్న కరెంట్ లైట్లు, ప్రజల ప్రాణాల తో చెలగాటం



### ప్రమాదం జరిగాకే అధికారులు కదులుతారా.?

మల్కాజిగిరి ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్) : జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం మౌలాలి ఆర్ఎఫ్‌సీ ముందు రహదారిపై కరెంట్ స్తంభానికి వేలాడుతూన్న కరెంట్ లైట్లు ప్రజలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోజూ వందలాది వాహనాలు, పాదచారులు వెళ్లే ఈ ప్రధాన రహదారిపై ఈ స్థాయిలో నిర్లక్ష్యం కొనసాగడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ లైట్లు పూర్తిగా భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తూ కిందకు వేలాడుతుండటం గమనార్హం. వర్షం పడిన సందర్భంలో లేదా పొరపాటున లైట్ ఊడిపోయి ప్రజల పై పడితే ప్రాణాలు హరించబడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయిన జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకంగా రాత్రి వేళ ఈ ప్రాంతంలో చీకటి ఎక్కువగా ఉండటంతో ప్రమాదం మరింత పెరుగుతోందని వాహనదారులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, వృద్ధులు నిత్యం ఈ మార్గాన్ని ఉపయోగిస్తుండటంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా ప్రాణనష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.



### ప్రమాదం జరిగిన తర్వాతే స్పందిస్తారా.?

ప్రమాదం జరిగాక చర్యలు తీసుకుంటారా.? ముందే నివారణ చర్యలు చేపట్టలేరా.?అంటూ జిహెచ్ఎంసి అధికారులపై వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని మున్సిపల్ స్ట్రీట్ లైట్ విభాగ యంత్రాంగం ప్రజల భద్రతను పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే కరెంట్ లైట్లను సరిచేసి, రహదారి భద్రత చర్యలు చేపట్టాలని, లేదంటే జరగబోయే పెద్ద ప్రమాదానికి జిహెచ్ఎంసి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# ఎర్రబోడ ఏరియా కమిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా

## మంగళారం యాదగిరి నియామకం.



రాజేంద్రనగర్, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్) : బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించడం జరుగుతుందని ఎర్రబోడ ఏరియా కమిటీ అధ్యక్షులు మంగళారం యాదగిరి తెలిపారు.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మార్గదర్శకాలతో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరగూడ డివిజన్ అధ్యక్షులు చేట్టి గారి నరేందర్ రావు,పెద్దలు కోలన్ సుభాష్ రెడ్డి,పోరెడ్డి ధర్మ రెడ్డిల చేతుల నియామక పత్రం అందజేయడం జరిగిందని ఆయన సూచించారు.అనంతరం మాట్లాడుతూ..బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల అందరికి పేరు పేరున నమస్కారాలు తెలుపుతూ,నాపైనా విశ్వాసం ఉంచి రాజేంద్రనగర్ నియోజకవర్గం,హైదరగూడ డివిజన్ ఎర్రబోడ ఏరియా కమిటీ అధ్యక్షులుగా మంగళవారం యాదగిరినీ నియమించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలపడం జరిగిందన్నారు.బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతం,ఆదర్శలకు అంకితమైన నీతి,నిజాయితీ,నిబద్ధత,క్రమశిక్షణ,చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని,సహచర కార్యకర్తలు,పార్టీ కమిటీలతో కలిసి పార్టీ మరింత భాలోపేతం చేయడానికి నా వంతు కృషి చేస్తానని ఎర్రబోడ ఏరియా కమిటీ అధ్యక్షులు మంగళవారం యాదగిరి తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలు,దీపక్,రాజేష్,ఆకాష్, సాయి కిరణ్,ప్రణీత్,హర్ష,నాని,శివ,కేశవ్,రక్షిత్,మణికాంత్,లక్ష్మి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సమాజానికి శుభాకాంక్షలు తెలిపిన

## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



ఖమ్మం, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్) :పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.దివ్య ఖురాన్ అవతరించిన ఈ పవిత్ర మాసంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఉపావాస దీక్షలు,ప్రతినిత్యం ఐదారు సార్లు ప్రార్థన,పేదలకు దానధర్మాలు చేస్తూ, ఆధ్యాత్మిక చింతనతో నియమ నిష్ఠలతో ముందుకు సాగుతారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్ని ధర్మాలను సమదృష్టితో చూశారని, ముస్లింల సంక్షేమం,ఉన్నతికి పలు పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుపర్చారని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యను ఇంగ్లీష్ మీడియంలో ఉచితంగా అందించేందుకు గాను పెద్ద సంఖ్యలో మైనారిటీ గురుకులాలను నెలకొల్పారన్నారు.షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు లక్షా 1,116 రూపాయల చొప్పున ఉచితంగా అందించిన మహనీయులు కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర తెలిపారు.విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపే యువతకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ పేరిట 20లక్షల చొప్పున విమాన టికెట్ తో పాటు ఉచితంగా అందించారని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఇమామ్,మౌజంలకు పారితోషికం ఇచ్చి కేసీఆర్ గౌరవించారని చెప్పారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణలో మత సామరస్యం వర్థిల్లిందని, మైనారిటీలు శాంతియుతంగా జీవించారని ఎంపీ రవిచంద్ర అన్నారు.రంజాన్ సందర్భంగా పేదలకు నూతన వస్త్రాలు, దుస్తులు బహుకరించడం, ప్రార్థనాస్థలాల మరమ్మత్తులకు నిధులు మంజూరు చేరడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.అదేవిధంగా కేసీఆర్ అధికారికంగా హైదరాబాద్ ఏల్బీ స్టేడియంలో ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసే వారన్నారు.మహ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ,శాంతి,సత్యం,దయ,కరుణలు నాటికి, నేటికి, ఏనాటికి కూడా మానవాళికి ఆచరణీయం,అనుసరనీయమని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ వాసులు, దేశవిదేశాల్లో నివసిస్తున్న, స్థిరపడిన మన రాష్ట్రానికి చెందిన ముస్లిం సమాజానికి ఎంపీ రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# కేశంపేటలో పల్లె ప్రకృతి వనం ధ్వంసం



కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : కేశంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని అనుమతి లేకుండా జేసీబీతో చెట్లు తొలగించిన ఘటన వివాదాస్పదమైంది. చెట్లు ఎక్కువగా పెరిగి ఇబ్బందిగా మారాయని చెప్పుతూ కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు ఈ చర్యకు పాల్పడ్డారని గ్రామస్తులు ఆరోపించారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాన్ని అధికారులకు సమాచారం ఇవ్వకుండా ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని వారు మండిపడ్డారు. ఆసుపత్రి సమీపంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పడం సరైంది కాదని, నిర్వహణ బాధ్యత అధికారులు చూసుకోవాలని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా ఘటనపై సమాచారం అందిందని, బాధ్యులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ప్రకృతి వనాన్ని పునరుద్ధరించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. గ్రామంలో ఈ ఘటనపై చర్చలు జోరుగా సాగుతున్నాయి.

# హైదర్గూడా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ

## వర్కింగ్ ప్రెసిడెంట్ గా కావేలి గూడెం గిరిబాబు నియామకం



రాజేంద్రనగర్, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్) : బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించడం జరుగుతుందని హైదర్గూడా డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కవేలి గూడెం గిరిబాబు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మార్గదర్శకాలతో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరగూడ డివిజన్ అధ్యక్షులు చేట్టి గారి నరేందర్ రావు,పెద్దలు కోలన్ సుభాష్ రెడ్డి,పోరెడ్డి ధర్మ రెడ్డిల చేతుల నియామక పత్రం అందజేయడం జరిగిందని ఆయన సూచించారు.అనంతరం మాట్లాడుతూ..బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల అందరికి పేరు పేరున నమస్కారాలు తెలుపుతూ,నాపైనా విశ్వాసం ఉంచి రాజేంద్రనగర్ నియోజకవర్గం, హైదరగూడ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కవేలి గూడెం గిరిబాబును నియమించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలపడం జరిగిందన్నారు.బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతం,ఆదర్శలకు అంకితమైన నీతి,నిజాయితీ,నిబద్ధత,క్రమశిక్షణ,చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని,సహచర కార్యకర్తలు,పార్టీ కమిటీలతో కలిసి పార్టీ మరింత భాలోపేతం చేయడానికి నా వంతు కృషి చేస్తానని హైదర్గూడా డివిజన్ టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కావేలి గూడెం గిరిబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలు,దీపక్,రాజేష్,ఆకాష్,సాయి కిరణ్,ప్రణీత్,హర్ష,నాని,శివ,కేశవ్,రక్షిత్,మణికాంత్,లక్ష్మి కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి,ఇంటర్ వార్షిక పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

## లీకేజీలు,అక్రమాలకు తావు కల్పిస్తే కఠిన చర్యలు

## సమన్వయక సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్) : పదవ తరగతి,ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.టెన్త్,ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మార్చి 14 నుండి ఏప్రిల్ 15వ తేదీ వరకు ప్రతీరోజు ఉదయం 9.30 నుండి మద్యాహ్నం 12.30 గంటల వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 24,542 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎస్సెస్సి పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.వీరిలో 24,399 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా,143 మంది ప్రైవేట్ అభ్యర్థులు ఉన్నారని వివరించారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ కోసం 144 ఎగ్జామినేషన్ సెంటర్స్ ఏర్పాటు చేశామని అన్నారు. అదేవిధంగా ఈ నెల (ఫిబ్రవరి) 25 నుండి మార్చి 18వ తేదీ వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు,ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి మద్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు.ప్రథమ సంవత్సరం పరీక్షలకు 19,299 మంది,ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 17,664 మంది కలుపుకుని మొత్తం 36,963 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు.పరీక్ష ప్రారంభం అయ్యే నిర్ణీత సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ ల వారీగా పోలీస్ ఎస్కార్ట్ మధ్య తీసుకెళ్లాలని అన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తూ,తగిన పోలీసు బందోబస్తు ఉండేలా చూడాలన్నారు.పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచాలని ఆదేశించారు.ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలని,పరిశుభ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆశా వర్కర్లు,ఏఎన్ఎం లను ఎగ్జామ్ సెంటర్లలో నియమించాలని,ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉండాలని,పరీక్షలు కొనసాగే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు లోనవకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హితవు పలికారు.ప్రశ్న పత్రాలు,ఆన్సర్ షీట్లను తగిన భద్రత మధ్య తరలించాలని సూచించారు.పరీక్షా కేంద్రాలలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లను అనుమతించకూడదని ఆదేశించారు.ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతనే లోనికి అనుమతించాలన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం అయినందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ఎంతో అప్రమత్తంగా ఉంటూ,పదవ తరగతి,ఇంటర్ వార్షిక పరీక్షలు సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు.ముఖ్యంగా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు ఎంతో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు.ఏ చిన్న పొరపాటు జరిగినా జిల్లాకు చెడ్డ పేరు వస్తుందని,విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని పరీక్షల నిర్వహణలో ఏ దశలోనూ పొరపాట్లకు అవకాశం కల్పించవద్దని అన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ,అవకతవకలకు తావు కల్పించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవికుమార్,జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్,ఏసీపీ మస్తాన్ అలీ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధరణి దోపిడిపై ఉక్కుపాదం

## తీగలాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం

## అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు

## కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు

## రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (జర్నలిస్ట్ ఫైల్) : తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాంతి కరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్ద కుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారని అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్ ను రూపొందించారని, భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్ చేశారని, అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నత స్థాయి కమిటీ విచారణలో ప్రాధమికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభించకుండా చేశారని, ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గత మైందని, ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్ పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వానికి రావలసిన ప్రతిపైసాను వసూలు చేస్తామన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, సిఎం ఆర్వో మందా మకరంద్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బి ఎస్పీ సింధు శర్మ, సైబర్‌క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, హోంశాఖ సలహాదారు పి. శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్లు పొందడంలో జర్నలిస్టుల ఇబ్బందులను తొలగించండి

## ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి డబ్ల్యూజేఐ ప్రతినిధుల వినతి

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల తెలంగాణ ప్రభుత్వం (ఐ అండ్ పీఆర్) జారీ చేసిన 'ది తెలంగాణ మీడియా అక్రిడేషన్ రూల్స్ 2025' లో కొన్ని నిబంధనలు జిల్లాల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు 'అక్రిడేషన్ కార్డులు' పొందడంలో ఇబ్బందిగా మారాయని, వాటికి వెంటనే సవరణలు చేయాలని కోరుతూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్లూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో అనుదీప్ దూరిశెట్టిని కలిసిన యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. ఎస్ రావు, ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కోకన్వీనర్లు యెన్నబోయిన శ్రీనివాస రావు, ఎం.ఏ అన్సార్ పాషా, అమరనేని రామకృష్ణ, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబరావు, బొడ్డుపల్లి రవీందర్ అక్రిడేషన్లు పొందడంలో చిన్న పత్రికలు, డెస్క్ఇండిపెండెంట్, వెబ్ సైట్, కేబుల్ టీవీ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సారి 2,000 నుండి 15, 000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు అసలు జిల్లా కేంద్రంలో అక్రిడేషన్ కార్డులే లేవని తెలిపారు. 15,000 నుండి 25, 000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు ఒక్క జర్నలిస్టుకు మాత్రమే కార్డు(మండలం) ఇస్తున్నారని, ఫోటో గ్రాఫర్ కు కూడా కార్డు లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే, 25,000 నుండి 75, 000 వరకు సర్క్యులేషన్ వున్న పత్రికలకు సహితం ఒక జర్నలిస్ట్, ఒక ఫోటో గ్రాఫర్ కు మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇస్తున్నారని, ఈ మూడు కేటగిరీల్లో డెస్క్ జర్నలిస్టులకు, జిల్లాలో ప్రచురణ కేంద్రం వుంటే





ఒక్కొక్క కార్డు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇవి ఆయా పత్రికల్లో పని చేస్తున్న ఫీల్డ్, డెస్క్ జర్నలిస్టులకు ఏ మాత్రం సరి పోనందున ప్రతి కేటగిరీలో కార్డులు పెంచాలని, జిల్లా కేంద్రాల్లో పని చేసే క్రైమ్, స్పోర్ట్స్, కల్చరల్, ఎడ్యుకేషన్ జర్నలిస్టులకు కూడా రాష్ట్ర స్థాయిలో ఇచ్చినట్లు 'అక్రిడేషన్ కార్డులు' ఇవ్వాలని కోరారు. డెస్కులో పని చేస్తున్న జర్నలిస్టు లందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, 'మహిళా జర్నలిస్టులు 33 శాతం లేని చోట ఆ కార్డులను మిగిలిన డెస్క్ జర్నలిస్టులకు ఇవ్వాలని, నిబంధనల్లో 'మాండేట్' అన్న పదాన్ని తొలగించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అక్రిడేషన్ కార్డులు పొందాలంటే, ఇండిపెండెంట్ (ఫ్రీలాన్సర్) జర్నలిస్టులు 5 పాత కార్డులతో పాటు 6 నెలల్లో ప్రచురితమైన 20 బై లైన్ వార్తా క్లిప్పులు పెట్టాలని విధించిన నిబంధనను సవరించాలని కోరారు. సీనియర్ జర్నలిస్టులు ఎక్కువగా చిన్న పత్రికలు, డిజిటల్ మీడియాలో వార్తలు రాస్తున్నందున, ఇండిపెండెంట్ జర్నలిస్టులు తమ వార్తలకు ఏ వేదికను ఉపయోగించుకున్నా , వార్త ఎక్కడ ప్రచురితమైనా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని సూచించారు. న్యూస్ వెబ్ సైట్లకు గడిచిన 6 నెలల్లో నెలకు 5 లక్షల యూనిక్ విజిటర్స్ వుండాలన్న నిబంధన కూడా సరైంది కాదని పేర్కొన్నారు. డిజిటల్ మీడియాలో ఒక యూనిక్ విజిటర్ ఒక పేపర్ సబ్ స్క్రైబర్ తో సమానమని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 2.5 లక్షల సర్క్యులేషన్ వున్న పత్రికలనే పెద్ద పత్రికలుగా గుర్తించినప్పుడు, ఒక వెబ్ సైట్ కు నెలకు 5 లక్షల యూనిక్ విజిటర్స్ వుండాలని నిబంధన పెట్టడం సమంజసం కాదని ఎర్కొన్నారు. ఇది పెద్ద పత్రికల సర్క్యులేషన్ కన్నా (డబుల్) చాలా ఎక్కువగా వున్నంద ఈ సంఖ్యను బాగా తగ్గించాలని కోరారు. అలాగే కేబుల్ టీవీ జర్నలిస్టులకు ప్రసార కేంద్రంలో (జిల్లాలో) 3 అక్రిడేషన్ కార్డులు మాత్రమే ఇస్తున్నారని, వాటిని గతంలో లాగా 4 కార్డులకు పెంచాలని కోరారు.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను అర్థం చేసుకొని తన పరిధిలో వున్న వాటిని పరిష్కరించాలని, లేని వాటిని సంబంధిత శాఖాధికారులకు పంపాలని కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టికి డబ్ల్యూజేఐ ప్రతినిధులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినుకొండ పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం వినుకొండ పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా చేసి విజయవంతం చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా వినుకొండ పట్టణ ప్రాంతంలో పర్యటించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాలు, కార్యాలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అందుకు సంబంధించి ఆయా జిల్లా అధికారులు నివేదికలను తయారు చేయాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం సభావేదిక ప్రాంగణం, హెలిప్యాడ్లను జిల్లా కలెక్టర్ పర్యటించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాంలు అందజేసిన శివశక్తి ఫౌండేషన్



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, ఆయన సతీమణి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి ఆదేశాల మేరకు శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం యూనిఫామ్ లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో పారిశుధ్య కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండ మునిసిపల్ కార్మికులకు శివశక్తి ఫౌండేషన్ వారు యూనిఫాంలు అందజేయటం అభినందనీయమన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు – లీలావతి దంపతులు అందిస్తున్న సేవలు ఈ ప్రాంత ప్రజలు మరువలేనివన్నారు. పట్టణ పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణన్ని అందించే పారిశుద్ధ్య కార్మికులను గౌరవిస్తూ యూనిఫామ్ లు అందిస్తున్న శివశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా 180 మంది కార్మికులకు యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ ఫణి కుమార్, పొలిటికల్ మేనేజర్ దిలీప్, చైర్మన్ దస్తగిరి షకీలా, రోశయ్య, టిడిపి నాయకులు పివి సురేష్ బాబు, నంది నరసింహారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్ ) :** తనపై భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులు కొట్టివేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచార సభలలో తనపై నిరాధార, అనుచిత ఆరోపణలు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేయడంతో రేవంత్ రెడ్డిపై రెండు కేసులు నమోదయ్యాయి. భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం కోర్టులో హాజరునుంచి ముఖ్యమంత్రికి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయడానికి గండ్ర వెంకటరమణారెడ్డి న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

# మసీదుల వద్ద సదుపాయాలు కల్పించండి

- **శానిటేషన్, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి**
- **పేదలకు గంజి పంపిణీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**
- **ఉద్యోగులకు వన్అవర్ పర్మిషన్‌పై సీఎంకు కృతజ్ఞతలు**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రంజాన్ మాసంలో మసీదులు వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు అధికారులు నిరంతరం పని చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు ఎమ్మెల్యే నసీర్ గంజి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రార్థనలకు వచ్చిన ముస్లిం సోదరులతో మాటామంతీ కలిపారు. రంజాన్ మాసమంతా ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో పేదలకు గంజి పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం వచ్చాక ముస్లిం మైనారిటీలకు పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. శానిటేషన్ పై ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. మసీదుల వద్ద మంచినీటి సరఫరాపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు గంట ముందుగా వెళ్లేందుకు అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముస్లిం మైనారిటీల కోసం రాష్ట్రంలో కమ్యూనికేషన్ స్కిల్ సెంటర్లు, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని చెప్పారు. తాజాగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విడుదల చేసిన బడ్జెట్ లో మైనారిటీల కోసం రూ. 6099 కోట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. మొదటి నుంచీ మైనారిటీలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తోందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో మౌజన్లు, ఇమామ్ లకు అందించాల్సిన గౌరవ వేతనం బకాయిలు సైతం కూటమి ప్రభుత్వంలో అందించామని తెలిపారు.

# గుంటూరులో పారిశుద్ధ్య పనులను మెరుగుపరచాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు, వ్యర్థాల పునర్వినియోగం దిశగా గుంటూరు నగరపాలక సంస్థ వేగంగా అడుగులు వేస్తోందని, అందులో భాగంగా తడి వ్యర్థాలతో విండ్రో కంపోస్ట్ యూనిట్, నిర్మాణ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కోసం సిడిడి వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్, వ్యర్థాల నుండి ఇంధనాన్ని తయారు చేసే బయో గ్యాస్ ప్లాంట్‌లను శాశ్వత ప్రాతిపదికగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. గురువారం నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్ సమీపంలో ఆయా ప్లాంట్స్ ఏర్పాటుకు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నాయుడు పేటలో గుర్తించిన ప్రాంతాన్ని ప్లాంట్ల ఏర్పాటుకు వీలుగా తక్షణమే సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్రమైన మ్యాప్‌ను రూపొందించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ జరగాలని, ఈ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే నగర పారిశుద్ధ్యంలో మంచి మార్పులు వస్తాయన్నారు. పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ విష్ణు, డిసిపీ సూరజ్ కుమార్, డిఈఈ సతీష్ కుమార్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, సర్వేయర్ సుభాని పాల్గొన్నారు.

# సత్యం కోసం ప్రాణాలర్పించిన శాస్త్రవేత్త గియోర్డానో బ్రూనో

- **మాజీ ఎమ్మెల్సీ.కె.ఎస్. లక్ష్మణరావు**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** విశ్వం యొక్క అనంతత్వాన్ని దర్శించి ఆధునిక ఖగోళ శాస్త్రానికి పునాదులు వేసిన గొప్ప శాస్త్రవేత్త గియోర్డానో బ్రూనో సూర్యుని చుట్టూ భూమి తిరుగుతుందని చెప్పినందుకు మతోన్మాదులు ఫిబ్రవరి 17, 1600 సంవత్సరంలో సజీవ దహనం చేశారని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన గుంటూరులోని రైల్ పేటలో గల కన్నా స్కూల్ లో సత్యాన్వేషణలో బ్రూనో బలిదానం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ సత్యం కోసం ప్రాణాలర్పించిన ఖగోళ శాస్త్రవేత్త బ్రూనో 426 వ వర్ధంతి జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. విశ్వం అనంతమైనదని, ఆకాశంలో కనబడే నక్షత్రాలు లక్షలాది ఉన్నాయని అవి సూర్యుని కన్నా అనేక రెట్లు ఎక్కువగా ఉన్నా యని మొదటిసారి ప్రపంచానికి తెలిపినారన్నారు. బ్రూనో ఖగోళ శాస్త్రవేత్త మాత్రమే కాదని స్వేచ్ఛ ఆలోచనల కోసం పోరాడిన యోధుడు అని కొనియాడారు. గురువును ఆలోచనలు ఆధునిక ఖగోళ శాస్త్రానికి పునాదులు వేసినాయని పేర్కొన్నారు. సత్యాన్ని అన్వేషించే క్రమంలో మత గ్రంథాలలోని వాక్యాలను గుడ్డిగా నమ్మరాదని 16వ శతాబ్దంలోనే గురువును స్పష్టంగా తెలిపినారన్నారు. సత్యాన్వేషణలో బ్రూనో బలిదానం పుస్తకాన్ని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆవిష్కరించి ప్రసంగించారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ విశ్వంలో సౌర కుటుంబాలు లక్షలాది ఉన్నాయని బ్రూనో తెలిపారని పేర్కొన్నారు. గెలీలియో, కోపర్నికస్ లాంటి శాస్త్రవేత్తలు బ్రూనో ఆలోచనలను శాస్త్రీయంగా రుజువు చేసి సూర్యుని చుట్టూ గ్రహాలు తిరుగుతున్నాయని, భూమి విశ్వానికి కేంద్రం కాదని రుజువు చేశారన్నారు. మతోన్మాదులు 1600 సంవత్సరం ఫిబ్రవరి 17న రోమ్ నగరంలో బ్రూనోను సజీవ దహనం చేశారని, 1889లో అదే ప్రాంతంలో బ్రూనో భావనలు వాస్తవమని శాస్త్రీయంగా రుజువైన తర్వాత బ్రూనో కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించారన్నారు. బ్రూనో ను 8 సంవత్సరాలు జైలులో ఉంచి సజీవ దహనం చేసినా తాను విశ్వసించిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచిన మహనీయుడని కొనియాడారు. ప్రపంచంలో మానవాభివృద్ధికి మతం ఆటంకం గా వందలాది సంవత్సరాలు కొనసాగిందన్నారు. సమాజాభివృద్ధికి తోడ్పడుతున్న శాస్త్రవేత్తలను హీరోలుగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నా మాస్టర్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్ బాబు, జన విజ్ఞాన వేదిక సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్ కమిటీ కన్వీనర్ టి. ఆర్. రమేష్, జిల్లా నేతలు సుభాని, ప్రవీణ్ లు పాల్గొని ప్రసంగించారు

## చాకుతో పొడిచి భర్తను హత్య చేసిన భార్య

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** టీవీ సౌండ్ విషయంలో జరిగిన గొడవ హత్యకు దారి తీసింది. భర్తను చాకుతో పొడవుగా భర్త హత్యకు గురైన ఘటన మంగళగిరి పట్టణ టిట్కో గృహ సముదాయంలో గురువారం సాయంత్రం జరిగింది. మంగళగిరి పట్టణ పోలీసుల సమాచారం మేరకు మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ ఏసీ మెకానిక్ గా పని చేస్తున్నాడు. మంగళగిరి పట్టణ ఇందిరానగర్ కు చెందిన గోగులమూడి క్రాంతి తో గత ఏడాది ప్రేమ వివాహం జరిగింది. మంగళగిరి పట్టణ టిట్కో గృహ సముదాయంలో భార్యాభర్తలిద్దరు జీవిస్తున్నారు. గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో టీవీ సౌండ్ పెంచే విషయంలో అహ్మద్ క్రాంతిల మధ్య గొడవ జరగగా భార్య క్రాంతి భర్త పై చాకుతో దాడి చేసింది. 108 అంబులెన్స్ ద్వారా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం అహ్మద్ ను తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళగిరి పట్టణ సీఐ కె వీరస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి పనులపై కలెక్టర్ సుడిగాలి పర్యటన

- **పారిశుద్ధ్య , తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి**
- **ప్రభుత్వ యంత్రాంగం పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలి**
- **అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తిచేయాలి**
- **అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**
- **అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలి**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమం అన్సారీయా అన్నారు. గురవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్ద (ఎంటిఎంసి) పరిధిలో సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. అనంతరం ఎంటిఎంసి కార్యాలయంలో మంగళగిరి నియోజవర్గ స్దాయి సమీక్షసమావేశం అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంటిఎంసి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. కాజా వద్ద ఎబీసీ సెంటర్ ను, ఈస్ట్ లేక్ వద్ద దాదాపు రూ. 2 కోట్ల సీఎస్ఆర్ తో ఏర్పాటు చేస్తున్న పార్కును, వైట్ ఫీల్డ్ పార్కు ను, ఉండవల్లి సెంటర్ విస్తరణ పనులను, మెటీరియల్ రికవరీ సెంటర్ వద్ద పనులను పరిశీలించడం జరిగిందన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించి సూచనలు అందించామన్నారు. నియోజకవర్గంలోని అన్ని రెవెన్యూ సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న పార్కుల పనులు 80 శాతం పూర్తయ్యాయని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. తాడేపల్లి లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్లు ను మే నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిడమర్రు గేటు వద్ద ఆర్వోబీ ని సాధ్యమైనంత వరకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్మించేందుకు ఉన్న అన్ని అవకాశాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు.

**కలెక్టర్ పరిశీలన**

తొలుత కాజ గ్రామంలోని యానిమల్ బర్త్ కంట్రోల్ (ఎబిసి) కేంద్రంలో డాగ్స్ కెన్నల్స్, ఫ్రీ ఆపరేషన్ గది, ఆపరేషన్ గది, ఫుడ్ ఫీడింగ్ ఏరియాను , రికార్డులను పరిశీలించారు. ఎబిసి సెంటర్ లో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ సర్జరీలు సజావుగా నిర్వహించి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. కేంద్రాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కాజాలో ఎ 17. 18 సెంట్లలోని ఈస్ట్ లేక్ వద్ద రూ. 2.70 కోట్లు తో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు, మొక్కల పెంపకం పనులను, ఎన్ ఆర్ ఐ సమీపంలో ఎంటీఎంసీ, సిఎస్ఆర్ నిధులు రూ. 46 లక్షలతో 0.75 ఎకరాల్లో నిర్మిస్తున్న వైట్ ఫీల్డ్ పార్కులో పనులను కలెక్టర్ పరిశీలించారు. పూర్తి స్థాయిలో పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాకింగ్ ట్రాక్ పూర్తిగా చదునుచేయాలని, పార్క్ ల నిర్వహణ సజావుగా కొనసాగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాళి మాత దేవాలయం సమీపంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల నిర్వహణలో పనిచేస్తున్న యాస్పిరేషనల్ టాయిలెట్లను పరిశీలించారు. పర్యావరణహితంగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన కల్పిస్తూ అక్కడ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎనీ టైం బ్యాగ్ కీయోస్కి పనితీరును పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ చక్కగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రయోగాత్మకంగా స్మార్ట్ స్ట్రీట్ రాష్ట్రంలో ప్రథమం**

తాడేపల్లి లోని ఆంధ్ర రత్న పంపింగ్ స్టేషన్ నుంచి పాతూరు వెళ్లే రోడ్డులో మెప్మా ఆధ్వర్యంలో 40 షాపులతో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ స్థలాన్ని పరిశీలించారు. ప్రజలకు ఆహ్లాదకరంగా వాతావరణంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు అమ్ముకునేలా స్మార్ట్ స్ట్రీట్ ను తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. స్మార్ట్ స్ట్రీట్ రాష్ట్రంలో ప్రథమంగా ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు.

కొలనుకొండలో కమ్యూనల్ స్థలాలను పరిశీలించి, నివేదిక అందించాలని తహశీల్దార్ కు సూచించారు. ట్రాఫిక్ రద్దీ కి అనుగుణంగా రూ. 1.69 కోట్ల తో అభివృద్ధి చేస్తున్న ఉండవల్లి సెంటరులో పనులను పరిశీలించారు. రాజధాని ప్రాంతం నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బందులు లేకుండా విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. నులకపేటలోని నాలుగు ఎకరాల చెరువును అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. ఆరు కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తాడేపల్లి తహసిల్దార్ కార్యాలయంను, స్వర్ణ వార్డు కార్యాలయంను సందర్శించి, అన్ని విభాగాలను పరిశీలించారు. కార్యాలయాలు పరిశుభ్రత మరింతగా మెరుగుపరచాలని కలెక్టర్ అధికారులు సూచించారు. పొడి వ్యర్థాల నిర్వహణకు ప్రకాష్ నగర్ లో నూతనంగా రూ. 96.74 లక్షలతో నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పొడి వ్యర్థాలతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సక్రమంగా నిర్వహణ చేయాలని అధికారులకు సూచించారు. ఎంటీఎంసీ పరిధిలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

**ఎంటీఎంసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం**

అనంతరం ఎంటిఎంసి కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంగళగిరి నియోజకవర్గం లో అభివృద్ధి, రెవెన్యూ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీరు పారుదల, విద్యుత్ సరఫరా పై ప్రజలు తెలిపిన సమస్యలు తక్షణమే పరిష్కరించేల చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో తాడేపల్లి, మంగళగిరి , దుగ్గిరాల మండలాలలోఇంటి స్థలాల రెగ్యులైజేషన్ దరఖాస్తులు వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నిషేధిత భూములు జాబితాల నుంచి స్థలాల తొలగింపు, ఇతర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం కోసం నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం నివేదికలను సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారుల ద్వారా కలెక్టర్ కార్యాలయంకు అందించాలన్నారు.

**యుజిడి పనులు వెంటనే ప్రారంభించాలి**

ఏంటీఎంసీ పరిధిలో యూజీడీ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కెఎల్ యూనివర్సిటీ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. రేవేంద్రపాడు బ్రిడ్జి, ఉండవల్లి, రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. దుగ్గిరాల మండలంలో హౌసింగ్ లేఅవుట్ లలో కాంట్రాక్టర్ స్టేజ్ డివియేషన్ వెంటనే సరి చేసేలా హౌసింగ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణలో ఇబ్బందులు ఉంటే సత్వరమే జిల్లాస్థాయి అధికారులు దృష్టికి తీసుకొస్తే సమస్యపరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

జాయింట్ కలెక్టర్, అశుతోష్ శ్రీవాస్తవ తో కలిసి కలెక్టర్ నిడమర్రు రైల్వే ట్రాక్ పై నిర్మించనున్న ఆర్ఓబీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో తెనాలి ఇన్చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, హౌసింగ్ పీడీ ప్రసాదు, ఐసీడీఎస్ పీడీ ప్రసునా, తహశీల్దార్లు దినేష్ రాఘవేంద్ర, సీతారామయ్య, సునీత, అదనపు డిప్యూటీ కమిషనర్ శకుంతలా దేవి, డిప్యూటీ కమిషనర్లు శ్రీకాంత్, శ్రీనివాసరావు, డీసీపీ అశోక్, ఎస్సీ లీలా కృష్ణ, సెక్రటరీ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి విద్యుత్ వైద్యారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తెనాలిలో... గుంటూరు సుభానీ హోటల్ ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమైన క్రమంలో గుంటూరు సుభాని హోటల్ బిర్యానీ రుచులు తెనాలిలో ఏర్పాటు చేయగా...ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్థానిక చెంచుపేట రైతుబజార్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన గుంటూరు సుభానీ హోటల్ ను, గురువారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించి, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈక్రమంలో క్యాష్ కౌంటర్ లో క్యాషియర్ గా వ్యవహరించారు.

వంటకాలను రుచులను ఆస్వాదించారు. తొలుత నిర్వాహకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు పూల బొకేతో ఘన స్వాగతం పలికారు. హోటల్ ప్రారంభ కార్యక్రమంలో పట్టణ టిడిపి అద్యక్షులు మహ్మద్ కుద్దూస్, గుమ్మడి భావన, పార్టీలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలో ఫిబ్రవరి 22 నుంచి మార్చి 5 వరకు జరగనున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ ఈవో, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 22న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను ప్రారంభించాలని మంత్రిని కోరారు. ప్రమాణస్వీకారం తర్వాత ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మొదటిసారి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ను ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కోగంటి సునీల్ కుమార్ తో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం వినుకొండ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 21వ తేదీన వినుకొండ పట్టణంలో పర్యటించనున్నారు. "స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఆయన విచ్చేసి, పట్టణంలో పారిశుద్ధ్య పనులు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు గురువారం పర్యటన ఏర్పాట్లను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎం బహిరంగ సభ నిర్వహించనున్న చీరా గ్రౌండ్‌ను సందర్శించిన జీవీ వేదిక నిర్మాణం మరియు ప్రజల కోసం చేయాల్సిన సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం హెలికాప్టర్ దిగేందుకు సిద్ధం చేస్తున్న జూనియర్ కాలేజీ గ్రౌండ్‌ను పరిశీలించి భద్రతా పరమైన చర్యలపై ఆరా తీశారు. జూనియర్ కాలేజీ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కూడా ఆయన సందర్శించారు. జీవీ మాట్లాడుతూ..పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా, ఎస్పీ కృష్ణారావు, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లలో వ్యర్థాలను విడివిడిగా అందజేయాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పేరుకుపోయిన ఈ–వ్యర్థాలను బాధ్యతాయుతంగా విడిగా అందజేయాలని, శుక్రవారం ఈ–వ్యర్థాల సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ–వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపడం వల్ల భూగర్భ జలాలు, పర్యావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందుకే నగరపాలక సంస్థ వీటిని శాస్త్రీయంగా, పర్యావరణహితంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రజల సౌకర్యార్థం నగరంలోని అన్ని వార్డుల్లో ఈ–వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, నిరుపయోగంగా ఉన్న సెల్ ఫోన్లు, బ్యాటరీలు, చార్జర్లు, కంప్యూటర్ భాగాల వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను ఆ కౌంటర్లలో అప్పగించాలని సూచించారు. ఫ్రిజ్ లు, టివిలు వంటి వాటిని జిఎంసి కాల్ సెంటర్ 0863 2345103 లేదా 9505378036 కి తెలియచేస్తే ఇంటి వద్దకే వచ్చి సేకరించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ గుంటూరు నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములై పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## నిబద్ధతతో విధులు నిర్వర్తించిన సబ్ రిజిస్టర్ ప్రసాదరావు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** చల్లపల్లి సబ్ రిజిస్టర్ గా నిబద్ధతతో విధులు నిర్వహించిన ప్రసాదరావు ప్రజల అందరి మన్ననలు పొందారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ గా పదోన్నతి పొందిన చల్లపల్లి సబ రిజిస్టర్ కె.ప్రసాద్ రావు ను సురేష్ బాబు రిజిస్టర్ కార్యాలయంలో కలిసి సన్మానించారు.

ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ పదోన్నతులు ఉద్యోగుల కష్టానికి,ప్రజలకు అందించే సేవలకు ప్రభుత్వం ఇచ్చే గొప్ప గుర్తింపు అని తెలిపారు. పదోన్నతుల ద్వారా ఉద్యోగుల పనితీరు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ లక్ష్యాలు,అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెరిగి మరింత సమర్థవంతంగా ఉద్యోగులు పనిచేస్తారన్నారు. పదోన్నతులు ద్వారా ఉద్యోగులపై మరింత బాధ్యతలు పెరుగుతాయన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ఓర్పు, స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలు అందించిన ప్రసాదరావు ప్రత్యేక గుర్తింపు,మన్ననలు పొందారని ప్రశంసించారు. సురేష్ బాబు తో పాటు డిఎన్ఏ టీవీ ఎండి సిహెచ్ రాజా రమేష్ తదితరులు సబ్ రిజిస్టర్ కు అభినందనలు తెలిపారు.

## రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై త్వరలో భేటి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు త్వరలో సమావేశం నిర్వహిస్తామని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యాన నాయకులు వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిసి గురువారం వినతిపత్రం అందించారు. విఆర్ఎవి ఆర్.ఓ, విలేజ్ సర్వేయర్స్, ఆఫీస్ సబార్డినేట్స్, తహశీల్దార్, వివిధ స్థాయి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన వెంటనే అసోసియేషన్ జెఏసి నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఏసి ఛైర్మన్ భూపతిరాజు రవీంద్ర రాజు. సెక్రటరీ జనరల్ బి. మధుబాబు, కన్వీనర్ బి. సుగుణమ్మ, కో ఛైర్మన్ ఎన్. పెద్దన్న, ట్రెజరర్ డి. చంద్రమౌళి, వైస్ ఛైర్మన్లు, బాలాజీ రెడ్డి, ఎం బాపూజి, మనోజ్, ఎన్ నాగేషం, జాయింట్ సెక్రటరీలు, అనూష, హరీష్, వీరభద్రరావు, హనుమంతు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర సర్వేయర్ల అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహేష్ నాయుడు, జాయింట్ సెక్రెటరీ సల్మా, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## దశలవారీ పోరుబాటకు ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నిర్ణయం

- ఫిబ్రవరి 20 నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు - మార్చి 3న జిల్లా కేంద్రాల్లో మహాధర్నాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్థిక డిమాండ్లు, విద్యారంగ సమస్యలు మరియు ఉపాధ్యాయుల పెండింగ్ అంశాల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు, ప్రధాన కార్యదర్శి యస్. చిరంజీవి వెల్లడించారు.

ఫిబ్రవరి 20వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. మార్చి 3న అన్ని జిల్లా కేంద్రాల్లో మహాధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. విజయానంద్‌కు ప్రత్యక్ష చర్య నోటీసు సమర్పించినట్లు తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2024 జూలై 1 నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏ కిస్తీలను విడుదల చేయాలని, 2018 జూలై 1 నుంచి చెల్లించాల్సిన డిఏ బకాయిలు, 11వ పిఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

రిటైర్ అయిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సి.పి.ఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు.

విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతలను తొలగించి ఏకీకృత సర్వీస్ నియమావళి సమస్యలను పరిష్కరించాలని, సంబంధిత జీవోలు అమలు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుండి విముక్తి కల్పించాలని, ఉన్నత పాఠశాలలలో ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టి, కలెక్టర్ పూల్ ద్వారా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తూ పరీక్షలను తెలుగులో రాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

అదనంగా, సాధారణ బదిలీలతో పాటు వేసవి సెలవుల్లో అంతర్ జిల్లా, అంతర్ మున్సిపాలిటీ బదిలీలు నిర్వహించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచి వారి సేవలను క్రమబద్ధీకరించాలని కోరారు. మండల విద్యాశాఖాధికారుల బదిలీలు చేపట్టాలని, పదవ తరగతి పరీక్షల నిర్వహణ ఉత్తర్వులు జిల్లాల స్థాయిలో జారీ చేయాలని సూచించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు జి.పి.ఎఫ్ అమలు చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులను ఆరోగ్య సేవల పరిధిలోకి తీసుకురావాలని, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, కేజీబీవీ సిబ్బందికి కనీస వేతన శ్రేణి వర్తింపజేసి వార్డెన్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు.

## సమగ్రశిక్ష సిబ్బంది జీతాల పెంపుదలపై కేంద్రంతో మాట్లాడతాం

- కర్నూలు జిల్లాలో అవసరమైన సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేస్తాం
- త్వరలోనే మరో డీఎస్సీ ప్రకటిస్తాం: శాసనసభలో మంత్రి నారా లోకేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డీటీపీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి జీతాల పెంపుదలపై వచ్చే ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు సమావేశంలో చర్చిస్తాం, కేంద్రంతో కూడా సంప్రదిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడకుదిటి ఈశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, డీటీపీ ఆపరేటర్ల జీతాలు దక్షిణ భారతంలోని తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే ఏపీలోనే అత్యధికంగా ఉన్నాయి. గతంలో 3నెలలకోసారి జీతాలు ఇవ్వగా, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన వారికి జీతాలు చెల్లిస్తున్నాం. సమగ్ర శిక్ష అనేది సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్. ఇందులో 60శాతం కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, 40శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేస్తుంది. అందువల్ల ఏ నిర్ణయం తీసుకున్నా కేంద్రప్రభుత్వ ఆమోదంతోనే తీసుకోవాల్సి ఉందని చెప్పారు. కర్నూలు జిల్లాలో సీజనల్ హాస్టళ్లు పెంచాలన్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి చేసిన విజ్ఞప్తిపై మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... కర్నూలు జిల్లాలో అవసరమైన మేర నూటికి నూరుశాతం సీజనల్ హాస్టళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఆలూరు, ఆదోని, మంత్రాలయంలో పర్యటించినపుడు ఆ ప్రాంతం ఎంత వెనుకబడి ఉందో ప్రత్యక్షంగా చూశాను. నంద్యాల, కర్నూలు పార్లమెంటు నడుమ ఎంతో వ్యత్యాసం కనిపించింది. నిన్న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో కర్నూలు పార్లమెంటు పరిధిలో వస్తున్న పరిశ్రమలకు అదనపు ఇన్సెంటివ్స్ కూడా ప్రజాప్రభుత్వం ఆమోదించింది. ఆ ప్రాంతంలో పెద్దఎత్తున పెట్టుబడులు తెచ్చే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. గత ఏడాది జరిగిన డీఎస్సీలో కూడా కర్నూలు జిల్లాకు ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశాం. అయినా ఇప్పటికీ టీచర్ - స్టూడెంట్ రేషియో అక్కడ తక్కువగా ఉంది. త్వరలో మరో డీఎస్సీ ప్రకటించబోతున్నాం. అందులో కర్నూలు పార్లమెంటుపై ప్రత్యేకంగా

## హిందూపురంలో ఏపీ టీఎస్ 6 ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు

- పాల్గొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ, మన్నవ
- గతంలో వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసిన ఏపీటిఎస్
- మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న బాలకృష్ణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** హిందూపురంలో గురువారం ముద్దిరెడ్డిపల్లి, వ్యవసాయ మార్కెట్ లోని ఆర్వో వాటర్ ప్లాంట్లను హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఏపీటిఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ప్రారంభించారు. గతంలో కూడా హిందూపురం నియోజకవర్గంలో పలు చోట్ల ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏపీపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ టీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మోహనకృష్ణ కొనియాడారు. హిందూపురం ప్రజల త్రాగునీటి కష్టాలను తొలగిస్తూ అపర భగీరథుడిగా బాలకృష్ణ నిలుస్తున్నారని మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు.

హిందూపురం నియోజకవర్గాన్ని బాలకృష్ణ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారు, అందుకే బాలకృష్ణ కి హిందూపురం లో ప్రతి ఎన్నికకు మెజారిటీ పెరుగుతోంది అని మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు.

హిందూపురం నియోజకవర్గంలో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంలో చూపిన చొరవకు, అలాగే గతంలో హిందూపురం అభివృద్ధి కోసం ఎన్నోసార్లు అందించిన సహాయానికి ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ ని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభినందించారు.

## బ్రాహ్మణుల పేరెత్తే అర్హత వైసీపీకి లేదు : బీజేపీ గంగాధర్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** బ్రాహ్మణ వర్గాల సంక్షేమాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులకు బ్రాహ్మణుల పేరెత్తే అర్హత లేదని బీజేపీ నేత, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తీవ్రంగా విమర్శించారు. వైసీపీ నాయకుడు, దేవాదాయ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

బ్రాహ్మణులకు ఏ ప్రభుత్వ హయాంలో మేలు జరిగిందన్న అంశంపై చర్చకు రావాలంటూ గంగాధర్ సవాల్ విసిరారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అయితే, అధికారంలోకి వచ్చిన వెంటనే గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ కె. బుచ్చి రాంప్రసాద్ మరియు డైరెక్టర్లపై విమర్శలు చేసే స్థాయి జ్వాలాపురపు శ్రీకాంత్‌కు లేదని గంగాధర్ అన్నారు. 2015 నుండి 2019 వరకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నిలిపివేసి బ్రాహ్మణులను మోసం చేసిందని విమర్శించారు.

మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో, ప్రభుత్వ పెద్దలతో చర్చించి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చారని తెలిపారు. దీనిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని గంగాధర్ పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ సలహాదారుడిగా పనిచేసిన జ్వాలాపురపు శ్రీకాంత్, తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారం, దేవాలయాలలో విగ్రహాల ధ్వంసం, రథాలు తగలబడిన ఘటనలు, అర్చకులపై దాడులు జరిగినప్పుడు ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఆ సమయంలో ఆయన ప్రవర్తనను రాష్ట్రంలోని బ్రాహ్మణులు గమనించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేవాలయ ఎండోమెంట్ కమిటీల్లో అ-ర్చకుడితో పాటు ఒక బ్రాహ్మణుడు ఉండేలా జీవో తీసుకువచ్చిన ఘనత ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌దేనని తెలిపారు. అలాగే అర్చకులకు ట్రెజరీ ద్వారా జీతాలు అందే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా నిరుపేద బ్రాహ్మణులను ఆదుకునేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెలగలేటి గంగాధర్ వెల్లడించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ తీరు ముదావహం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆరోగ్య శ్రీ పరిధిలో ఆరోగ్య సేవలు పొందలేని కుటుంబాల వారికి,సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లభిస్తున్న ఆర్థిక తోడ్పాటు, ఓ కార్యచరణగా కొనసాగడం గొప్పవిషయమని,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. స్థానిక రామలింగేశ్వర పేటలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అర్హత పొందిన 14 మంది లబ్ధిదారులకు, 11 లక్షల 15 వేల 452 రూపాయల విలువైన, చెక్కులను, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆరోగ్య సేవలకు, అర్హులను గుర్తించి, నగదు సహాయం చేయడం, గొప్ప అంశమని అన్నారు. నియోజకవర్గ ప్రజల తరఫున , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్, జొన్నాదుల మహేష్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, కుదరవల్లి శ్రీనివాసరావు, లబ్ధిదారులు ఉన్నారు.

## విద్యుత్ శాఖలో ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తాం: ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారు ప్రకటించారు. గురువారం అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గారు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో మొత్తం 2,947 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి వివరాలను మంత్రి సభకు వెల్లడించారు. ఎనర్జీ అసిస్టెంట్లు 581, జూనియర్ లైన్ మెన్ 1,260, అసిస్టెంట్ లైన్ మెన్ 1,084, లైన్ మెన్ 22 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 8,770 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో విధులను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖలో ఏఈలు, లైన్ మెన్ల కొరత లేకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు లో-వోల్టేజ్ సమస్యలు లేకుండా, నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగానే ఇంధన శాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పునరుద్ఘాటించారు. విద్యుత్ లోడ్ ఆధారంగా అవసరమైన చోట కొత్త సబ్ స్టేషన్లను మంజూరు చేస్తున్నామని, అదేవిధంగా ఎలక్ట్రికల్ డీఈ కార్యాలయాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని శాసన సభలో సభ్యులకు మంత్రి గొట్టిపాటి వివరించారు.

## దళిత కుటుంబాలకు న్యాయం చేయకపోతే పోరాటం తప్పదు

- 22 నుండి 25 వరకు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉద్యమ కార్యక్రమాలు
- ఎమ్మెస్పీ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, సొట్ట సొట్టా నరేంద్ర బాబు



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్) :** బ్రహ్మంగారి మఠం మండల పరిధిలో ఈనెల 5న ఇద్దరూ యువకులు అనుమానస్థితిలో తెలుగు గంగ కాలవలో శవమై తేలడం దాని వెనుక హత్యగానే అనుమానాలు ఉన్నాయని ఇద్దరికీ యువకుల మరణం వెనకాల కారణాలు బయటికి రావాలి ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మైదుకూరు నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల దళిత బంధువులను నుండి నిరసన కార్యక్రమాలను చేపట్టాలని అందులో భాగంగానే ఈనెల 21వ తేదీన తాహశీల్దార్ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తాహశీల్దార్ కు వినతి పత్రాలు 22వ తేదీన దళిత ఆత్మగౌరవం కొవ్వొత్తుల నిరసనలు 23వ తేదీన జిల్లా కలెక్టర్ విన్నపత్రం 24వ తేదీన అన్ని దళిత గ్రామాలలో దళిత యువకుల ఆత్మ శాంతి ర్యాలీ 25వ తేదీన మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారు ప్రథమ శిష్యుడైన శ్రీ శ్రీ శ్రీ కక్కయ్యస్వామి వారి మఠం నుండి తాహశీల్దార్ కార్యాలయం వరకు శాంతియుతర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఎమ్మెస్పీ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు సొట్టా నరేంద్ర బాబు పేర్కొన్నారు గురువారం స్థానిక మండల కేంద్రంలోని ఆది జాంబవంతుల అరుంధతి అన్నదాన సత్రంలో విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఉద్దేశించి, వారు మాట్లాడుతూ ఈ నెల5,6 తేదీన ఇద్దరూ యువకులు తెలుగు గంగ కాలవలో వేరువేరుగా యువకులు అనుమాన స్థితిలో మృతి చెందడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానిక పోలీసులు మృతుల వెనక ఉన్న రహస్యం పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ మాన్య మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జాతీయ కమిటీ రాష్ట్రకమిటీ జిల్లా స్థాయి నుండి మండల స్థాయి ఎంఆర్పిఎస్ డిమాండ్ చేశారు కార్యచరణ లో భాగంగానే 22 నుండి 25 వరకు గ్రామ సై నుండి మండల స్థాయి వరకు ఉద్యమాలు శాంతియుత ర్యాలీలు చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని 25వ తేదీన బిమఠం తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్య మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారు ఇప్పటికే మైదుకూరు నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాలలో కార్యచరణ కార్యక్రమంలో మాదిగ సోదరులకు కార్యచరణ తెలియజేయడం జరిగిందని మాదిగ బిడ్డలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం తప్పదని వారు తెలిపారు స్థానిక శాసనసభ్యులు దళిత కుటుంబాలకు న్యాయం ఎమ్మార్పీఎస్ తరఫున కోరుతున్నామన్నారు ఈ మరణాల వెనక రహస్యాలను వెల్లడించకపోతే ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని ఇప్పటికైనా జిల్లా ఎస్పీ ప్రత్యేక టీమును ఏర్పాటు చేసి దళిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూడాలని వారిని కూడా కోరుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో బుడగ జంగాల రాష్ట్ర ఉపాధ్యక్షులు, తొటి కొండయ్యఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు కేవన్ రాజు, ఎం ఈ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, హరినాథ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెన్నయ్య మాదిగ, సంజీవ్ మాదిగ నారాయణ మాదిగ చలపతి,

ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు, ఎర్రంపల్లె జ్ఞానేశ్వరరావు, ఎంఎస్పి మండల అధ్యక్షులు, ఎం ఈ ఎఫ్, మండల అధ్యక్షులు కొడవటిగంటి గురవయ్య, మృతుల బంధువులు, వివిధ గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల నేపథ్యంలో అంబేద్కర్ గురుకులాల ఇంటర్ విద్యార్థులతో మంత్రి డిఎస్ బీవీ స్వామి వీడియో కాన్ఫరెన్స్

- పరీక్షల పట్ల భయం పోగొట్టేలా విద్యార్థుల్లో ధైర్యం నింపిన మంత్రి
- జేఈఈ మెయిన్స్ లో అర్హత సాధించిన 161 మంది విద్యార్థులకు మంత్రి డా.స్వామి అభినందనలు
- చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు 161 మంది జేఈఈ మెయిన్స్ లో అర్హత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా, ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి సూచించారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో గురువారం నాడు తాడేపల్లిలోని APSWREIS కార్యాలయంలో అంబేద్కర్ గురుకులాల ఇంటర్ విద్యార్థులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి పరీక్షల పట్ల భయం పోగొట్టేలా విద్యార్థుల్లో ధైర్యం నింపారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం జేఈఈ మెయిన్స్ లో అర్హత సాధించిన 161 మంది విద్యార్థులను మంత్రి స్వామి అభినందించారు.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు 161 మంది జేఈఈ మెయిన్స్ కి అర్హత సాధించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సాహం వల్లే గతేడాది కంటే 3 మూడు రెట్లు ఎక్కువ మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు.

గతేడాది ఐఐటీ, నీట్ లో సీట్లు సాధించిన 57 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహం అందించామని మంత్రి తెలిపారు.

పేద పిల్లలు ఇంజనీర్లు,డాక్టర్లు కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. పేద విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరించి వారిని అన్ని విధాల ప్రోత్సహిస్తుందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో AP-SWREIS కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467